



epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com




సంపుటి : 18 సంచిక : 16 | 02-03-2026 సోమవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00



# 'అటల్‌జీకి అక్షర నిరాజనం'

- వాజ్‌పేయి జీవితాన్ని అధ్యయనం చేయాలి..
- యువత వాజ్‌పేయి లాంటి నాయకులుగా ఎదగాలని దిశానిర్దేశం
- యువత రాజకీయాల్లోకి రాలేకపోతున్నారు..
- రాజకీయాల్లో భాష మారాలి..
- వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు

దేశవ్యాప్తంగా అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలు జరగటం సంతోషకరమని భారత మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. 'అటల్‌జీకి అక్షర నిరాజనం' కవితా సంకలనం పుస్తకం ఆవిష్కరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తనకు పితృసామానులైన వాజ్‌పేయికి నివాళు లర్పించడం తన బాధ్యత అని తెలిపారు. ఇవాళ (ఆదివారం) ఖమ్మం జిల్లాలో వెంకయ్య నాయుడు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వాజ్‌పేయి నాయకత్వంలో అఖిల భారత జనతా పార్టీకి అధ్యక్షుడిగా పని చేసే మహాభాగ్యం తనకు దక్కిందని చెప్పుకొచ్చారు. ప్రజా హృదయ సామ్రాట్‌గా అటల్‌జీని పిలుచుకుంటారని వివరించారు.

వార్త 2లో



## ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అయతొల్లా అరాఫీ

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో ఆ దేశం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన వారసుడిగా అయతొల్లా అలిరెజా అరాఫీని ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా ఆదివారం నియమించింది. టెహ్రాన్‌లోని నివాసంపై అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఖమేనీ మరణిం చినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది.

వార్త 2లో

# మీకోసం నరక ద్వారాలు తెరిచి ఉంచుతున్నాం...

- అమెరికా, ఇజ్రాయెల్ పై ఇరాన్ ప్రతీకార దాడులు
- అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడి దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం
- ప్రతీకారంగా గంటల వ్యవధిలోనే విరుచుకుపడ్డ ఇరాన్ సైన్యం
- కువైట్, దుబాయ్‌లోని అమెరికా బేస్‌లే లక్ష్యంగా క్షిపణి దాడులు
- దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సహా పలు కీలక ప్రాంతాల్లో పేలుళ్లు
- యుద్ధం విస్తరించే ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన



మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు దట్టంగా అలుముకున్నాయి. ఇరాన్ అణు చర్చలు విఫలమైన నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడిగా నిర్వహించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. టెహ్రాన్‌తో పాటు పలు నగరాలపై జరిగిన ఈ భీకర వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్ గంటల వ్యవధిలోనే తన ప్రతాపాన్ని చూపించింది. 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్-4' పేరుతో ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్ జీసీ) అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై విరుచుకుపడింది. శత్రువులకు నరకం అంటే ఎలా ఉంటుందో చూపిస్తామని తీవ్ర హెచ్చరికలు చేసింది.

వార్త 2లో

## ప్రజా ప్రభుత్వం కాదు.. పేదల వ్యతిరేక ప్రభుత్వం: రామచందర్ రావు



**ఖమ్మం:** వెలుగుమట్లలోని భూదాన్ భూములను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పరిశీలించారు. భూనిర్వాసితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా పేదల ఇళ్లను కూల్చివేశారని మండిపడ్డారు. "భూదాన్ బోర్డు పట్టాలున్న పేదల ఇళ్లను కూల్చివేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. పేదల వ్యతిరేక ప్రభుత్వం. పేదల ఇళ్లు కూలగొట్టి ఏం సాధించారు? బాధితుల పక్షాన బిజెపి పోరాడుతుంది. కూల్చిన చోట పేదల 100 గజాలలో ఇల్లు నిర్మించి ఇవ్వాలి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే పేదలను పంపించేస్తున్నారు" అని ఆరోపించారు.



## ఈ హత్య కిరాతకమైన చర్య... ఖమేనీ మరణంపై ఘాటుగా స్పందించిన పుతిన్

ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా స్పందించారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఖమేనీ ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

వార్త 2లో

## పేదల ఇళ్లను కూల్చడం తగదు: కెటిఆర్

**హైదరాబాద్:** ఇండ్ల కూల్చివేతలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. ఒక్క ఇల్లు కూల్చకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది అని అన్నారు. హైదర్ షా కోట్, కేకే నగర్ వాసులతో కెటిఆర్ పాదయాత్ర చేశారు. సేవ్ మూసీ, సేవ్ హోమ్స్ అంటూ మూసీ బాధితులు ప్లకార్డుల ప్రదర్శన చేశారు. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ దుశ్చర్యలకు వ్యతిరేకంగా..క్షేత్ర స్థాయిలో బిఆర్ఎస్ పోరుబాట సాగింది. రాజీవ్ గృహకల్ప నిర్వాసితులతో కెటిఆర్ మాట్లాడారు. మూసీ తీరప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఆందోళనలు, కన్నీటి గాథలే కనిపిస్తు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ప్రతి ఒక్కరూ కూడా బాధితులకు అండగా సంఘీభావంగా నిలబడాల్సిన అవసరం ఉందని అన్నారు.






## దాడుల ఆలోచన చేయకపోతే ఇరాన్‌కే మంచిది: ట్రంప్

## నాగ్‌పూర్‌లో భారీ పేలుడు.. 15 మంది మృతి

**నాగ్‌పూర్:** మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని కటోల్‌లో భారీ పేలుడు సంభవించింది. పేలుడు పదార్థాల తయారీ సంస్థ ఎస్‌బిఎల్ ఎనర్జి లిమిటెడ్‌లో ఈ తెల్లవారుజామున ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 15 మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నారని.. వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం జరిగిన పరిశ్రమలో డిటోనేటర్లు, కాస్ట్ బూస్టర్లు, భూకంప పేలుడు పదార్థాలు తయారు చేస్తారని స్థానికులు తెలిపారు. ఉదయం అందులోని ఒక యూనిట్‌లో ప్రమాదం సంభవించిందని.. ఆ సమయంలో 30 మందికి పైగా ఉద్యోగులు వివిధ యూనిట్లలో పని చేస్తున్నారని తెలిపారు.

# ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అయతొల్లా అరాఫీ

అమెరికా ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఖమేనీ మృతి

ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అలిరెజా అరాఫీ నియామకం

పరిపాలన కోసం ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు

గార్డియన్ కౌన్సిల్ సభ్యుడిగా అరాఫీకి ఉన్నత అనుభవం

అక్షరకలం ప్రతినిధి

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో ఆ దేశం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన వారసుడిగా అయతొల్లా అలిరెజా అరాఫీని ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా ఆదివారం నియమించింది. టెహ్రాన్‌లోని నివాసంపై అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఖమేనీ మరణిం చినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇస్లామిక్ విప్లవ నేత ఖొమేనీ మరణం తర్వాత, 1989 నుంచి ఖమేనీ ఇరాన్ అత్యున్నత నాయకుడిగా కొనసాగుతూ వచ్చారు.ఖమేనీ మరణం తర్వాత దేశ పాలనా వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, జ్యుడీషియరీ చీఫ్ గులాంహొస్సేన్ మొహసెని ఎజెయి, గార్డియన్ కౌన్సిల్ జ్యూరిస్ట్ ఉంటారని 'ఐఆర్ఎన్ఏ' (ఐఆర్ఎన్ఏ) వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, 88 మంది సభ్యులున్న అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ తదుపరి పూర్తిస్థాయి సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే వరకు ఈ కౌన్సిల్ బాధ్యతలు నిర్వహిస్తుంది.రష్యన్ మీడియా సంస్థ 'ఆర్టీ' (ఆర్టీ) కథనం ప్రకారం.. 1959లో ఇరాన్‌లోని మేబోద్‌లో జన్మించిన అయతొల్లా అరాఫీ, షియా మతగురువుగా, ఇస్లామిక్ న్యాయనిపుణుడిగా పేరు పొందారు. 2016 నుంచి ఇరాన్ ఇస్లామిక్ సెమినరీస్ మేనేజ్‌మెంట్ సెంటర్ హెడ్‌గా, ప్రఖ్యాత కోమ్ సెమినరీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. దేశ చట్టాలను, ఎన్నికలను పర్యవేక్షించే శక్తివంతమైన గార్డియన్ కౌన్సిల్‌లో కూడా ఆయన సభ్యుడిగా ఉన్నారు. గతంలో 2008 నుంచి 2018 వరకు అల్-ముస్తఫా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా కూడా అరాఫీ పనిచేశారు.

# ఈ హత్య కిరాతకమైన చర్య...

ఖమేనీ మరణంపై ఘాటుగా స్పందించిన పుతిన్

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి

ఈ ఘటనను సినికల్ మర్డర్ గా అభివర్ణించిన పుతిన్

ఖమేనీ కుటుంబ సభ్యులు మరియు సైనిక అధికారులు కూడా మృతి

అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన అంటూ రష్యా అధ్యక్షుడు లేఖ

ఇది తమ చట్టబద్ధమైన హక్కు అంటూ ఇరాన్ ప్రతీకార హెచ్చరికలు

అక్షరకలం ప్రతినిధి

ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా స్పందించారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఖమేనీ ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని 'సినికల్ మర్డర్' (కిరాతక హత్య)గా అభివర్ణించిన పుతిన్.. ఇది అంతర్జాతీయ చట్టాలను, మానవత్వాన్ని పూర్తిగా ఉల్లంఘిం చడమేనని పేర్కొన్నారు.ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌కు పుతిన్ ఓ లేఖ రాశారు. ఖమేనీని రష్యాలో అత్యుత్తమ రాజనీతిజ్ఞుడిగా గుర్తుంచుకుంటామని, ఇరు దేశాల సంబంధాల బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారని ఆ లేఖలో కొనియాడారు. శనివారం జరిగిన ఈ దాడుల్లో ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, పలువురు సీనియర్ సైనిక అధికారులు మరణించినట్లు ఇరాన్ మీడియా ధృవీకరించింది.ఈ ఘటనతో ఇరాన్ 40 రోజుల పాటు సంతాప దినాలను ప్రకటించింది. తమ నాయకుడి మరణానికి ప్రతీకారం తీర్చుకోవడం తమ చట్టబద్ధమైన హక్కు, బాధ్యత అని ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండటంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ అధినేతలు స్పందిస్తూ.. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరగాలని సూచించారు. ఖమేనీ మరణం ప్రపంచ రాజకీయాల్లో, ముఖ్యంగా రష్యా-ఇరాన్ సంబంధాల్లో కీలక మార్పులకు కారణం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మీకోసం నరక ద్వారాలు తెరిచి ఉంచుతున్నాం...

అమెరికా, ఇజ్రాయెల్ పై ఇరాన్ ప్రతీకార దాడులు

అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడి దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం

ప్రతీకారంగా గంటల వ్యవధిలోనే విరుచుకుపడ్డ ఇరాన్ సైన్యం

కువైట్, దుబాయ్‌లోని అమెరికా బేస్‌లే లక్ష్యంగా క్షిపణి దాడులు

దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సహా పలు కీలక ప్రాంతాల్లో పేలుళ్లు

యుద్ధం విస్తరించే ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన

మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు దట్టంగా అలుముకున్నాయి. ఇరాన్ అణు చర్చలు విఫలమైన నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడిగా నిర్వహించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. టెహ్రాన్‌తో పాటు పలు నగరాలపై జరిగిన ఈ భీకర వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్ గంటల వ్యవధిలోనే తన ప్రతాపాన్ని చూపించింది. 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్-4' పేరుతో ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్ జీసీ) అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై విరుచుకుపడింది. శత్రువులకు నరకం అంటే ఎలా ఉంటుందో చూపిస్తామని తీవ్ర హెచ్చరికలు చేసింది.

### అమెరికా బేస్‌లే లక్ష్యంగా..

ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ ఐదో దశ దాడులను ముమ్మరం చేసింది. కువైట్‌లోని అబ్దుల్లా ముబారక్ ప్రాంతంలో ఉన్న అమెరికన్ నావల్ బేస్‌పై 4 బాలిస్టిక్ క్షిపణులు, 12 డ్రోన్లతో ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో బేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తిగా ధ్వంసమైందని, పలువురు అమెరికన్ సైనికులు మరణించారని సమాచారం. అటు హిందూ మహాసముద్రంలోనూ ఇరాన్ అలజడి సృష్టించింది. అమెరికా నౌకలకు ఇంధనం సరఫరా చేస్తున్న కంబాట్ సపోర్ట్ షిప్‌పై 'ఖద్ర 380' క్షిపణులతో దాడి చేసింది.

మరోవైపు, దుబాయ్‌లోని జెబెల్ అలీ యాంకరేజ్‌లో అమెరికాకు ఆయుధాలు చేరవేస్తున్న నౌకపై కూడా డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల తీవ్రతకు దుబాయ్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. అంతకుముందు పామ్ ఐలాండ్, బుర్జ్ అల్ అరబ్ ప్రాంతాల్లోనూ దాడులు జరిగినట్లు వార్తలు వచ్చాయి. పర్షియన్ గల్ఫ్ దేశాలతో పాటు ఇరాక్ కుర్దిస్తాన్‌లోని అమెరికా బేస్‌లపై కూడా ఇరాన్ ఎయిర్ ఫోర్స్ బాంబుల వర్షం కురిపించింది.

### శత్రువులకు నరకమే..

తమ నాయకుడి మరణానికి ప్రతీకారంగా 'చరిత్రలోనే అత్యంత భయంకరమైన అఫెన్సివ్ ఆపరేషన్' చేపడతామని ఐఆర్ జీసీ హెచ్చరించింది. "శత్రువులకు నరక ద్వారాలు తెరిచి ఉంచుతాం.. ఇమామ్ హంతకులకు కచ్చితంగా శిక్ష పడుతుంది" అని టెలిగ్రామ్ వేదికగా ఇరాన్ సైన్యం ప్రకటించింది. అమెరికా మిత్రదేశాలైన యూఏఈ, కతార్‌లలోనూ పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ఆయా దేశాలు ఆందోళన చెందుతున్నాయి. శత్రువులకు సహకరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ పరోక్షంగా హెచ్చరించింది. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ అంటోనియో గుటెరెస్ స్పందించారు. తక్షణమే హింసను ఆపాలని, లేదంటే ప్రపంచ భద్రతకే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. అటు రష్యా, యూరోపియన్ యూనియన్ కూడా ఇరు పక్షాలు సంయమనం పాటించాలని కోరాయి. ఏది ఏమైనా ఖమేనీ మరణం తర్వాత మధ్యప్రాచ్యంలో పరిస్థితులు పూర్తిగా అదుపు తప్పినట్లు కనిపిస్తోంది.

# 'అటల్‌జీకి అక్షర నిరాజనం'

వాజ్‌పేయి జీవితాన్ని అధ్యయనం చేయాలి..

యువత వాజ్‌పేయి లాంటి నాయకులుగా ఎదగాలని దిశానిర్దేశం

యువత రాజకీయాల్లోకి రాలేకపోతున్నారు..

రాజకీయాల్లో భాష మారాలి..

వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు

ఖమ్మం జిల్లా, అక్షరకలం ప్రతినిధి

దేశవ్యాప్తంగా అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలు జరగటం సంతోషకరమని భారత మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. 'అటల్‌జీకి అక్షర నిరాజనం' కవితా సంకలనం పుస్తకం ఆవిష్కరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తనకు పితృసామానులైన వాజ్‌పేయికి నివాళులర్పించడం తన బాధ్యత అని తెలిపారు. ఇవాళ(ఆదివారం) ఖమ్మం జిల్లాలో వెంకయ్య నాయుడు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వాజ్‌పేయి నాయకత్వంలో అఖిల భారత జనతా పార్టీకి అధ్యక్షుడిగా పని చేసే మహాభాగ్యం తనకు దక్కిందని చెప్పుకొచ్చారు. ప్రజా హృదయ సామ్రాట్‌గా అటల్‌జీని పిలుచుకుంటారని వివరించారు.



### వాజ్‌పేయి జీవితాన్ని అధ్యయనం చేయాలి..

వాజ్‌పేయి ఎందరో నాయకులను తయారు చేశారని వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. నేటి యువత ఆయన జీవితాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. యువత వాజ్‌పేయి లాంటి నాయకులుగా ఎదగాలని దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగత విమర్శలు చేయడం, అభ్యంతరకరంగా మాట్లాడటం నేడు గొప్పతనంగా భావిస్తున్నారని.. అలా మాట్లాడటం గొప్పతనం కాదనే విషయాన్ని యువత తెలుసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. తాను పదవి విరమణ చేశానే కానీ పెదవి విరమణ చేయలేదని ఒక మిత్రుడికి చెప్పానని తెలిపారు. పత్రికల్లో, టీవీల్లో తాను పెద్దగా కనిపించడం లేదని ఆ మిత్రుడు అమెరికాలో అడిగారని ప్రస్తావించారు. పత్రికల్లో, టీవీల్లో అనుచితంగా మాట్లాడే వాళ్లని చూపిస్తున్నారని.. వ్యక్తిగత విమర్శలు చేసే వాళ్లని చూపిస్తున్నారని.. ఆ విధంగా మాట్లాడటం తనకు రాదని.. అలాంటి విమర్శలు తనకు చేతకాదని ఆ మిత్రుడికి చెప్పానని గుర్తుచేశారు. వాజ్‌పేయి వంటి మహానేత జీవితాలు ఆదర్శంగా తీసుకొని నేటి యువత ఆదర్శవంతమైన రాజకీయ నాయకులుగా ఎదగాలని దిశానిర్దేశం చేశారు.

### యువత రాజకీయాల్లోకి రాలేకపోతున్నారు..

నేటి రాజకీయ నాయకుల ప్రవర్తన, వాళ్ల మాటలు చూసి యువత రాజకీయాల్లోకి రావాలంటేనే ఆలోచిస్తున్నారని, ఉత్సాహంగా ముందుకు రాలేకపోతున్నారని వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. విలువలతో కూడిన రాజకీయం ప్రమాణాలు సిద్ధాంతాలతో కూడిన రాజకీయం మళ్లీ రావాలని ఆకాంక్షించారు. నేడు సిద్ధాంతాలు లేవని.. అంతా రాద్ధాంతమేనని తెలిపారు. పదవుల కోసం పార్టీలు మారే రాజకీయాలు మంచిది కాదని హితవు పలికారు. పదవుల కోసం ఏ ఎండకు ఆ గొడుగు పట్టినట్లుగా నేతలు పార్టీలు మారుతున్నారని విమర్శించారు. ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. ఒకప్పుడు కశ్మీర్‌కి వెళ్లాలంటే అక్కడి ప్రభుత్వం అనుమతి తీసుకుని వెళ్లాలని, శ్యాం ప్రసాద్ ముఖర్జీ అందుకు ఒప్పుకోలేదని ప్రస్తావించారు. తన దేశంలోకి వెళ్లటానికి తనకు అనుమతి ఎందుకంటూ ఆయన కశ్మీర్‌లో ప్రవేశించారని గుర్తుచేశారు. అక్కడ శ్యాంప్రసాద్ ముఖర్జీని అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. అలాంటి రాజకీయ నేతలు మనందరికి ఆదర్శం కావాలని సూచించారు. ఈ దేశం కోసం ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడిన ఎందరో మహానీయులు యువతకు ఆదర్శం కావాలని వెంకయ్య నాయుడు దిశానిర్దేశం చేశారు.

# దాడుల ఆలోచన చేయకపోతే ఇరాన్ కే మంచిది: ట్రంప్

వాషింగ్టన్: అక్షరకలం ప్రతినిధి

ఇరాన్ లోని ఇతర నాయకులు చేయగలిగేది ఏమీ లేదని, అయతుల్లా అలీ ఖమేనీ బాధితులకు న్యాయం చేశామని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఖమేనీ మృతి ఇరాన్ ప్రజలకే కాదు.. అమెరికన్లకు గొప్ప విజయం అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దేశాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఇరాన్ ప్రజలకు ఇదే గొప్ప అవకాశం అని.. తమ నిఘా నుండి ఆధునిక ట్రాకింగ్ వ్యవస్థ నుంచి ఖమేనీ తప్పించుకోలేక పోయారని విమర్శించారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, సైన్యం, పోలీసులు తమతో పోరాడాలనుకోవట్లేదని, ఇరాన్ సైన్యం తమ నుంచి మద్దతు కోరుకుంటున్నారని ట్రంప్ తెలియజేశారు. ఇరాన్ ప్రజాస్వామ్య వాదులతో సైన్యం, రివల్యూషనరీ గార్డ్స్ కలవాలని, అందరూ కలిసి ఇరాన్ ను గొప్పగా పునర్నిర్మించాలని సూచించారు. శాంతి నెలకొనేవరకు దాడులు కొనసాగుతాయని పేర్కొన్నారు. భారీ స్థాయిలో దాడులు చేస్తామని ఇరాన్ ప్రకటించిందని, దాడుల ఆలోచన చేయకపోతే ఇరాన్ కే మంచిదని సూచించారు. ఇరాన్ దాడులకు దిగితే మరింత తీవ్రతతో దాడులు చేస్తామని, ఇంతకు ముందెన్నడూ చూడని క్షిపణులతో దాడి చేస్తామని ట్రంప్ హెచ్చరించారు.

# ఖమేనీ హత్య... హైదరాబాదులో నల్ల దుస్తులు ధరించి రోడ్డెక్కిన షియా ముస్లింలు

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యపై హైదరాబాద్‌లో నిరసనలు

అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ భారీ ర్యాలీ

ఖమేనీ మృతికి సంతాపంగా ఇరాన్ కాన్సులేట్ వద్ద జెండా అవనతం

ముందస్తు జాగ్రత్తగా పాతబస్తీలో పోలీసుల భారీ బందోబస్తు

అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంపై హైదరాబాద్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆదివారం పాతబస్తీలోని షియా ముస్లింలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. ఖమేనీ మరణవార్త ధృవీకరణ కావడంతో పాతబస్తీలోని షియా ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పురానీ హవేలీ, నూర్ ఖాన్ బజార్, దారుల్షా తదితర ప్రాంతాల్లో నల్ల దుస్తులు ధరించి, చేతిలో ఖమేనీ ఫొటోలు పట్టుకుని ర్యాలీలు నిర్వహించారు.తంజీమ్-ఎ-జాఫరీ సంస్థ పిలుపు మేరకు పురానీ హవేలీలోని మజార్-ఎ-ఇబ్నే-ఖతూన్ నుంచి భారీ ర్యాలీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న పలువురు కంటతడి పెడుతూ నినాదాలు చేశారు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడినందుకే ఖమేనీని పొట్టనబెట్టుకున్నారని, అగ్రరాజ్యాలకు తలొగ్గని నేతగా ఆయన నిలిచారని షియా మత పెద్దలు కొనియాడారు. ముస్లింల మధ్య ఐక్యత లేకపోవడమే ఈ విషాదానికి దారితీసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు ఖమేనీ మృతికి సంతాప సూచకంగా హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం వద్ద ఆ దేశ జాతీయ జెండాను అవనతం చేశారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పాతబస్తీలో ముందు జాగ్రత్తగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, శనివారం ఉదయం టెహ్రాన్‌లో తన నివాసంలోని కార్యాలయంలో ఉండగా అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 86 ఏళ్ల ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనవడు కూడా మృతి చెందారని ఇరాన్ మీడియా వెల్లడించింది.

# ఫిబ్రవరి నెల జీఎస్టీ వసూళ్లలో మహారాష్ట్ర టాప్

ఫిబ్రవరిలో రూ.1.83 లక్షల కోట్లకు చేరిన స్థూల జీఎస్టీ వసూళ్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా రూ.20.27 లక్షల కోట్ల ఆదాయం

దేశీయ రాబడి కంటే దిగుమతుల ద్వారానే అధిక వృద్ధి నమోదు

వసూళ్లలో మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల హవా

గతేడాదితో పోలిస్తే భారీగా తగ్గిన నెట్ సెస్ వసూళ్లు

అక్షరకలం ప్రతినిధి

దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు ఫిబ్రవరి నెలలో భారీగా నమోదయ్యాయి. 2026 ఫిబ్రవరి నెలకు గాను రూ.1.83 లక్షల కోట్ల స్థూల జీఎస్టీ వసూలైనట్లు కేంద్రం ఆదివారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు నెలతో



పోలిస్తే ఇది 8.1 శాతం అధికం కావడం విశేషం.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఫిబ్రవరి 28 నాటికి మొత్తం స్థూల జీఎస్టీ ఆదాయం రూ.20.27 లక్షల కోట్లకు చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 8.3 శాతం వృద్ధిని సూచిస్తోంది. ఇక ఫిబ్రవరిలో రూ.22,595 కోట్ల రీఫండ్లు చెల్లించారు. రీఫండ్లు సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ.1.61 లక్షల కోట్లుగా నమోదైంది.దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.3 శాతం వృద్ధితో రూ.1.36 లక్షల కోట్లుగా ఉండగా.. దిగుమతుల ద్వారా వచ్చిన రాబడిలో మాత్రం 17.2 శాతం భారీ వృద్ధి కనిపించింది. దిగుమతుల ద్వారా రూ.47,837 కోట్లు సమకూరాయి. అయితే, సెస్ వసూళ్లు మాత్రం ఆందోళనకరంగా తగ్గాయి. గతేడాది ఫిబ్రవరిలో రూ.13,481 కోట్లుగా ఉన్న నికర సెస్.. ఈసారి రూ.5,063 కోట్లకు పడిపోయింది.రాష్ట్రాల వారీగా చూస్తే మిశ్రమ ఫలితాలు కనిపించాయి. పారిశ్రామిక రాష్ట్రాల్లో వృద్ధి నమోదు కాగా, వనరుల ఆధారిత రాష్ట్రాల్లో వసూళ్లు తగ్గాయి. మహారాష్ట్ర రూ.10,286 కోట్ల వసూళ్లతో దేశంలోనే అగ్రస్థానంలో నిలవగా... కర్ణాటక, గుజరాత్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాల్లో సానుకూల వృద్ధి నమోదు కాగా.. పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఆదాయం తగ్గింది. జీఎస్టీ 2.0 తర్వాత వసూళ్లు స్థిరంగా పెరుగుతున్నాయని, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ బలంగా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దిగుమతుల రాబడి పెరగడం అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాల జోరును సూచిస్తోందని పేర్కొన్నారు.

# సీఎం చంద్రబాబును కలిసిన నూతన సీఎస్ సాయి ప్రసాద్

ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (సీఎస్) బాధ్యతలు స్వీకరించిన సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. సీఎస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారిగా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన సీఎస్ సాయి ప్రసాద్‌కు సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర పరిపాలనా యంత్రాంగానికి అధిపతిగా బాధ్యతలు స్వీకరించినందుకు ఆయనను అభినందించారు. వీరిద్దరి మధ్య కాసేపు భేటీ జరిగింది.మరోవైపు, ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక బాధ్యతలు చేపట్టిన మరో అధికారి కూడా చంద్రబాబును కలిశారు. సీఎంకు ఎక్స్ ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులైన విజయానంద్ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

# నివారణాత్మక పోలీసింగ్‌పై దృష్టి: తెలంగాణ రాష్ట్ర డీజిపి శివధర్ రెడ్డి

సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల మూలాలపై దృష్టి, సరిహద్దు రాష్ట్రాల నుంచి ఇసుక అక్రమ రవాణా పూర్తిస్థాయిలో కట్టడి

పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, పోలీస్ గృహ భవనాలను ప్రారంభించిన డిజిపి



**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



నివారణాత్మక పోలీసింగ్‌పై దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర డీజిపి బి. శివధర్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాలో పర్యటన సందర్భంగా ఆదివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు చేరుకున్న రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ముందుగా సాయిధ పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. మల్టీ జోన్ ఐజిపీ చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతంపలికారు. పోలీస్ హెడ్ క్వాటర్స్ లో నిర్మించిన పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అదేవిదంగా అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన పోలీస్ గృహ భవనాలను మల్టీ జోన్ ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి తో కలసి డిజిపి ప్రారంభించారు. పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, పోలీస్ ఫ్యామిలీ గృహ భవనాలను పరిశీలించారు. టెన్నిస్, పికిల్ బాల్, షటిల్ కోర్ట్, నిర్మిస్తున్న ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ద్వారా పోలీస్ సిబ్బంది, పోలీస్ పిల్లలను ఉత్తమ క్రీడాకారులను చేయడం లక్ష్యంగా నిర్మితమైతుందని అన్నారు. అదేవిదంగా నిత్యం విధినిర్వహణలో ఉండే తెలంగాణ పోలీస్ సిబ్బంది కుటుంబాలకు మెరుగైన వసతి కల్పించడం ద్వారా పోలీస్ సిబ్బంది పనితీరును మరింత మెరుగుపరచే ఉద్దేశంతో జిల్లా కేంద్రంలో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన పోలీస్ గృహ భవనాలను నిర్మించామని డిజిపి తెలిపారు. అనంతరం పోలీస్ శిక్షణ కేంద్రంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశంలో పాల్గొని జిల్లా వ్యాప్తంగా నేర గణాంకాలు, ముఖ్య కేసుల దర్యాప్తు పురోగతి, శాంతి భద్రతా చర్యలు, మహిళలు, శిశువుల భద్రత, సైబర్ నేరాల, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, ఇసుక అక్రమ రవాణా పై చేపడుతున్న చర్యలు, పలు అంశాలపై విస్తృత సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డీజిపి మాట్లాడుతూ..తెలంగాణ పోలీసుశాఖకు దేశంలోనే మంచి పేరుందని, ఇతర రాష్ట్రాలతో పోల్చితే నేరాల నియంత్రణలోనూ.. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలోనూ ముందువరుసలో ఉన్నామని తెలిపారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల మరణాలు, మాదకద్రవ్యాలు...ఇప్పుడు తెలంగాణ సమాజం ముందున్న పెనుసవాళ్లని వీటి నియంత్రణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థలు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ), ఈగల్ దేశంలోనే అత్యున్నతంగా పనిచేస్తున్నాయని అన్నారు. డ్రగ్స్ ముఠాలు తెలంగాణ నుండి వెళ్లిపోయేలా చేయడంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. "పదేళ్లుగా సైబర్ నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయని, ఇది సాధారణ సమస్య కాదని పేర్కొన్నారు. స్వీయ అవగాహనతోనే సైబర్ మోసాలకు కళ్లెం వేసేందుకు ఇంటి గుమ్మం వద్దకు ప్రచారాన్ని తీసుకెళ్లాలనే లక్ష్యంతో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ రూపొందించిన 'సైబర్ సింబా' కార్యక్రమం జిల్లాలో అమలు చేయడం ద్వారా సైబర్ నేరాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు.రోడ్డు ప్రమాదాలు తీవ్ర సమస్యగా మారుతోందని, రోడ్డు ప్రమాదాల విషయంలో దారుణమైన రికార్డులు నమోదు అవుతున్నాయని, ప్రతి సంవత్సరం వేలాది మంది యువత మరణిస్తున్నారని, ఇది తీవ్ర ఆందోళనకరమైన సమస్య అని అన్నారు. ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తులు సురక్షితంగా ఇంటికి చేరాలని లక్ష్యంతో చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటికే రోడ్డు ప్రమాదాలపై సీరియస్ దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని కూడ అన్ని శాఖల సమన్వయంతో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సంకల్పంతో మార్చి 25 నుండి 31 వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. మాదకద్రవ్యాల రవాణాను ఏమాత్రం సహించబోమని, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై తనిఖీలు, నిఘా పెరగటంతో ముఠాలు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, కట్టడి చేసేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. బేసిక్ పోలీసింగ్, చట్టాలపై లోతైన అవగాహన కోసం దృష్టి పెట్టాలని, పోలీస్ స్టేషన్ రికార్డు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలని, ప్రజలకు వేగంగా న్యాయం అందించేలా పోలీసు యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ జిల్లా నేర ధోరణులు, పెండింగ్ కేసుల స్థితి, ముఖ్య విచారణల పురోగతి, నేర నియంత్రణకు అమలు చేస్తున్న ప్రత్యేక చర్యల వివరాలు డీజీపీకి వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు ప్రసాద్ రావు, రామానుజం, కుమారస్వామి, విజయబాబు ఏసీపీ రమణమూర్తి, తిరుపతి రెడ్డి,సారంగపాణి, శ్రీనివాసులు, మహేష్, సర్వర్, సత్యనారాయణ, ఫణిందర్, సుశీల్ సింగ్, నర్సయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సీతారామ చంద్ర స్వామి కళ్యాణం మరియు పట్టాభిషేకం మహోత్సవాలపై ప్రత్యేక సమావేశం

## మంత్రి పొంగులేటి. శ్రీనివాస్ రెడ్డి,

**అక్షర కలం/భద్రాచలం**

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో రాముడు నడయాడిన ప్రాంతం భారతదేశానికి తలమానికమని అటువంటి రాముడి కళ్యాణానికి దేశ విదేశాల నుంచి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించి అంగరంగ వైభవంగా కళ్యాణం మరియు పట్టాభిషేకం జరిగేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు ఆదేశించారు. ఆదివారం నాడు భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలోశ్రీసీతారామ చంద్రస్వామి కళ్యాణం,పట్టాభిషేకంమహోత్సవాల నిర్వహణపైఆయనప్రత్యేకసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాముల వారి కళ్యాణానికితెలంగాణముఖ్యమంత్రివర్యులు మరియు ఇతర వివిఐపీలు తప్పనిసరిగా వీక్షించడానికి వస్తున్నందున జిల్లా యంత్రాంగం సమన్వయంతో వారికి అప్పగించిన బాధ్యతలే కాకుండా తోటి అధికారుల బాధ్యతలు కూడా తీసుకొనివివిఐపీలకు,వీఐపీలకు,రామ భక్తులకు గాని, ప్రజలకు గాని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వకంగా ప్రవర్తించి అందరూ తనివి తీర కళ్యాణం తిలకించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకొని అందుకు తగ్గట్లు అన్ని ఏర్పాట్లు చేయాలని, ఈనెల ఇరవై ఏడో వ తేదీన స్వామివారి కళ్యాణం ఉదయం పది గంటల ముప్పై నిమిషాల నుండి పన్నెండు గంటల ముప్పై నిమిషాల వరకు జరుగుతుందని అలాగే ఇరవై ఎనిమిదో వ తేదీన జరిగే మహా పట్టాభిషేకం ఉదయం పది గంటల గంటల నుండి పన్నెండు గంటల ముప్పైనిమిషాలవరకుజరుగుతుందని అన్నారు. భక్తుల సౌకర్యార్థం స్వామి వారి టికెట్లు అందుబాటులో ఉంచాలని, స్వామివారి తలంబ్రాలు, ప్రసాదాలు పంపిణీకి ప్రత్యేకకౌంటర్లు, అత్యవసర చికిత్స కేంద్రాలుఏర్పాటు చేయాలని ఆయనఅన్నారు.ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో యాభై బెడ్లు, ప్రత్యేక వార్డు మరియు పర్ణశాలతో కలుపుకొని పదమూడు మెడికల్ క్యాంపులు,మెడికల్ఆఫీసర్లుసిబ్బంది సరిపడామందులుఅందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. కళ్యాణం తిలకించడానికి మండపాన్ని ఇరవై ఆరు సెక్టార్లుగా ఏర్పాటుచేసినందున ప్రతి సెక్టార్కు ప్రత్యేక అధికారులను నియమించాలని,భక్తులకుమంచినీరు, మజ్జిగ పాకెట్లు, విఐపి సెక్టర్ మొదలుకొని భక్తులకు మంచినీళ్లు టాప్స్ ఏర్పాటు చేయాలని మరియు పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఏడు చోట్ల మరియు భద్రాచలంపట్టణంలో డ్రమ్ములుఏర్పాటచేసిగ్రామపంచాయతీ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించాలని,అన్ని శాఖలఅధికారలుసిబ్బందిసమన్వయంత శానిటేషన్ పరంగాప్రత్యేకజాగ్రత్తలుతీసుకో వాలని, కరకట్ట ప్రదేశం నుండి కళ్యాణం జరుగు స్టేడియం,భద్రాచలంపట్టణం, దేవాలయంపరిసరాలలోఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా అన్ని చోట్ల గ్రామపంచాయతీ లేబర్ ను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. స్వామివారి తలంబ్రాలు పంపిణీకి యనాభై కౌంటర్లు,లడ్డూలు సరఫరాకు ఇరవై.కౌంటర్లు, ప్రతిరోజు లక్షన్నర లడ్లు, భక్తులకు అందించేలా



చర్యలుతీసుకావాలని,ఈసంవత్సరం భక్తులకు తలంబ్రాలు ప్రసాదాలు కొరత లేకుండా చూడాలని అన్నారు. గ్రామపంచాయతీ సహకారంతో రోడ్డు శుభ్రంగా ఉండేలా చూసుకొని ములుగురోడ్డునుండిభద్రాచలయానికి వచ్చే అన్ని అప్రోచ్ రోడ్లకు ప్యాచ్ వర్క్ చేయించాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. కళ్యాణము మరియు పట్టాభిషేకం అయిపోయే వరకు విద్యుత్ సమస్య రాకుండా చూసుకోవాలని, సారపాక నుండి భద్రాచలం పట్టణంలో పూర్తిస్థాయిలో విద్యుత్ వెలుగులు వెదజల్లేలా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు చూసుకోవాలని, అవసరమైతే ఐదు వందల కెపాసిటీ గల కెవి టుజనరేటర్అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. భక్తులు గోదావరి లోకి వెళ్లకుండా భారీ కేడింగ్ ఏర్పాటు చేయాలని, రిస్క్ బోట్లు,గజఈతగాళ్లనుఅందుబాటులో ఉంచుకోవాలని, స్త్రీలు బట్టలు మార్చుకునేషెల్టర్లుఏర్పాటుచేయాలని, పర్ణశాలలో కూడా భద్రాచలంలో చేసిన విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ శాఖ వారికి ఆదేశించారు. టిఎస్ఆర్టిసి ద్వారా భక్తులకుఉదయంనుంచేకళ్యాణమండపం వచ్చే విధంగా బస్సులు నడిపించాలని అన్నారు. కళ్యాణము పట్టాభిషేకం అయిపోయే వరకు భద్రాచలంతో పాటు సారపాక ఏటపాకలలో ఉన్న బార్ షాపులు అన్ని మూయించాలని, భద్రాచలం కు వచ్చే ప్రతి వాహనమును క్షుణ్ణంగా పరిశీలించాలని ఎక్సైజ్ శాఖ వారికి ఆదేశించారు. భద్రాచలం వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం అన్ని రూట్లలలో బస్సులు తిరిగేలా చూడాలనిఅలాగేలాడ్జిలయజమానులు భక్తుల నుండి అధిక చార్జీ వసూలు చేయకుండా సంబంధిత సబ్ కలెక్టర్ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని అన్నారు. పోలీస్ శాఖ వారు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అన్నారు. భద్రాచలంకు వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థలు మరియు పలు రకాల దాతలు ముందుకు వచ్చి భోజన సౌకర్యాలు కల్పిస్తారని తప్పనిసరిగా సంబంధిత ఫుడ్ ఇన్స్పెక్టర్లు హోటల్లో కానీ రోడ్ల పైన గాని దొరికే తినుబండారాలు నాసిరకంగాఉండకుండాచూడవలసిన బాధ్యత ఫుడ్ ఇన్ స్పెక్టర్ పై ఉన్నందున ప్రతిరోజు చెక్ చేస్తూ ఉండాలని అన్నారు. అగ్నిమాపక శాఖ ద్వారా ఫైర్ ఇంజన్లు కళ్యాణ మండపం మొదలుకొని ముఖ్యమైన కూడళ్లలో అందుబాటులో ఉంచి పట్టణం మొత్తం పహారా కాస్తూ ఉండాలని అన్నారు. ఇతర ప్రాంతాల నుంచివచ్చేభక్తులకుసరైనసమాచారం తెలిసేవిధ ంగాసమాచారకేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అధికారులందరూతమకుఅప్పగించినబాధ్యతలనుకళ్యాణంతిలకి ంచడానికి వచ్చే భక్తులు మన బంధువుల మాదిరిగా భావించి లోటుపాట్లుజరగకుండాశ్రద్ధతీసుకోవాలనిఆయనఅధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలోమహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక.బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం.వెంకటరావు,భద్రాద్రికొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మ్రినాలి శ్రేష్ట, ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, సర్పంచ్ పునేం.కృష్ణ దొర,వివిధ శాఖల అధికారులు,అనధికారులు పాల్గొన్నారు

# సమాజ చైతన్యానికి సాహిత్యం దోహదం

ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు

వైభవంగా 'అక్షరాలతోవ' 8వ వార్షికోత్సవ వేడుకలు

కథ, కవిత, వక్తృత్వ పోటీల విజేతలకు పురస్కారాల ప్రదానం

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం:సమాజ చైతన్యానికి సాహిత్యం దోహదం చేస్తుందని ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు పేర్కొన్నారు. 'అక్షరాలతోవ' సాహితీ సంస్థ ఎనిమిదవ వార్షికోత్సవం ఖమ్మం లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం 'అక్షరాలతోవ' నిర్వాహకులు నామా పురుషోత్తం అధ్యక్షతన జరిగింది. తొలుత కథలు, కవితలతో ప్రచురించిన పుస్తకాన్ని, జూలూరుపాడు మండలం పాపకొల్లు ఉన్నత పాఠశాల విద్యార్థి గార్లపాటి కృష్ణ మనోహర్ రచించిన 'ప్రకృతి సాయం' కథల పుస్తకాన్ని మువ్వా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. ఎనిమిది ఏండ్లుగా అక్షరాలతోవ సాహితీసేవ చేయడం అభినందనీయమన్నారు. ఏటేటా పోటీలు నిర్వహిస్తూ కవులను, రచయితలను ప్రోత్సహిస్తున్న అక్షరాలతోవను అభినందిస్తున్నానన్నారు. విద్యార్థులలో సాహితీ



బీజాలు నాటడం, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించడం, బాల సాహిత్యం పట్ల అక్షరాలతోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమల్ల ఉపేందర్‌కున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. పోటీలు నిర్వహించడమే కాదు, విజేతలైన కవుల, రచయితల రచనలను ఏటేటా పుస్తకంగా వెలువరించడం గొప్ప విషయంగా భావిస్తున్నానన్నారు. సమాజ వికాసానికి అక్షరాలతోవ చేస్తున్న సాహితీ సేవకు సాహితీవేత్తలందరూ ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం ప్రముఖ రచయిత్రి వురిమళ్ల సునంద మాట్లాడుతూ... కవిత్రయం చేస్తున్న సాహితీ సేవను అభినంస్తున్నానని, వారికి ప్రోత్సాహంగా తానెప్పుడూ ఉంటానని పేర్కొన్నారు. పరిశ సీతారత్నం ట్రస్టు వ్యవస్థాపకులు పరిశ పుల్లయ్య మాట్లాడుతూ.. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సాహితీ సేవ చేస్తున్న నిర్వాహకులను అభినందిస్తున్నానన్నారు. మునుముందు కూడా వారికి తన ప్రోత్సాహం ఉంటుందన్నారు. ప్రముఖ కథా రచయిత మంత్రిప్రగడ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అక్షరాలతోవ ద్వారా ఎంతోమంది కవులు గుర్తింపు పొందారని, వారిలో తానొకరినని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత్రి తాళ్లూరి లక్ష్మి, బాల సాహితీవేత్త సయ్యద్ షఫీ, పొత్తూరి సీతారామారావు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ ప్రసంగించారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీల విజేతలైన ఎనుగంటి వేణుగోపాల్, పొత్తూరు సీతారామరాజు, డాక్టర్ జడ సుబ్బారావు, మంత్రిప్రగడ శ్రీనివాసరావు లకు అక్షరాలతోవ నగదు పురస్కారాన్ని అందించారు. ఆదివారం అక్షరాభిషేకం పేరుతో వారం వారం నిర్వహించిన కవితా పోటీల విజేతలను ఘనంగా సన్మానించారు. వార్షికోత్సవం సందర్భంగా.. పలు పాఠశాలల్లో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెమొంటో, సర్టిఫికెట్ అందజేసి సన్మానించారు. జిల్లాలో కళా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న కళాకారులు, గాయకులు మూసా, పాగి వెంకన్న, మొగిలి గుణకర్, కెవి చారి, నాగసాయి, మోదుగు గోవింద్, సదానందం, స్వప్నలకు మెమొంటో అందజేసి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అక్షరాలతోవ నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్, రాచమల్ల ఉపేందర్, ప్రముఖ కవులు దిలావర్, పోతగాని సత్యనారాయణ, కన్నెగంటి వెంకటయ్య, గద్దపాటి శ్రీనివాస్, ఐనాల సైదులు, ధరణికోట రమేష్, ఎం.వి రమణ, దేవయ్య, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కోండ్రు బ్రహ్మం, రేళ్ళ శ్రీనివాస్, పెద్దోజు నరేష్, ఇబ్రహీం నిర్గుణ్, పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లిపూర్ గ్రామం మాజీ సర్పంచ్ బోడుగే అనసూయమ్మ గారి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**అక్షర కలం సిద్దిపేట మార్చి 01:**

సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బోడిగే అనసూయమ్మ గారి ప్రథమ వర్ధంతి కార్యక్రమం లో పాల్గొని ఆమె జ్ఞాపకార్థం వారి కుమారులు గ్రామానికి వైకుంఠ రథం, శవ పెటిక ను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు అనసూయమ్మ మన మధ్యలో లేక పోవచ్చు కానీ ఆమె చేసిన మంచి పనులు.. సేవ లు ఉన్నాయని, ఆమె జ్ఞాపకార్తం వారి కుమారులు వైకుంఠ రథం, ఫ్రీజర్ ను అందించడం చాలా మంచి కార్యక్రమం.. అనసూయమ్మ హయాంలో గ్రామం మంచి అభివృద్ధి జరిగిందని, ఆమె నన్ను కలసి రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, ఇతర పనులు విషయం నిత్యం నా వెంట పడి పనులు చేపించుకొనే వారని, ఎల్లప్పుడూ గ్రామ అభివృద్ధి కె పాటు పడేదని ఆమె సేవలను కొనియాడారు. డబ్బులు, సంపాదన పదవులు శాశ్వతం కాదు చేసే పనులు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. అల్లీపూర్ గ్రామాన్ని అభివృద్ధి ఆదర్శం గా నిలిపామని గుర్తు చేశారు. కస్తూర్బ పాఠశాల ను ఏర్పాటు చేసి ఇంటర్మీడియట్ వరకు చేసానని గుర్తు చేశారు. గ్రామం అన్ని కమ్యూనిటి హాల్స్ నిర్మాణం చేసుకున్నామని రోడ్లు కూడా దాదాపు గా పూర్తి చేసుకున్నామని చెప్పారు. ఇంకా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించిన అనసూయమ్మ కుటుంబానికి అభినందనలు తెలిపారు. మిగతా గ్రామాలు కూడా ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కి వైకుంఠ రథం, ఫ్రీజర్ ( శవ పెటికను ) అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నకోడూరు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మద్యం సేవించి వాహనాలు నడపరాదు: ధన్వాడ ఎస్సై వెంకటేష్ గౌడ్

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చి,01)**

నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ధన్వాడ మండల కేంద్రంలో వాహనదారులకు, ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అలాంటి చర్యలు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తాయని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రెండు చక్రాల వాహనదారులు హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలి, వేగ పరిమితిని మించకూడదని హెచ్చరించారు. డ్రైవింగ్



సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం పూర్తిగా మానుకోవాలని తెలిపారు. అలాగే ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, సురక్షితమైన డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చుని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు: ఎస్పీ డాక్టర్ వినీత్.

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చి , 01)**

శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌లిఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... 30 పోలీస్ ఆక్ట్ మార్చ్ 31వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30




పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

**సంపాదకీయం...**

# చెంపదెబ్బ.. .గోడదెబ్బ !

**దేశంలో రెండు అసాధారణమైన కేసులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. న్యాయవ్యవస్థ గట్టిగా నిలబడేలా తీసుకున్న చర్యలు ఇప్పుడు రాజకీయ నాయకుల కళ్లు తెరిపిస్తాయా లేదా అన్నది చూడాలి. ముందుగా ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కామ్‌పై ఇచ్చిన తీర్పు ఒకటయితే..ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో న్యాయవ్యవస్థపై అచ్చేసిన పాఠ్యాంశం మరొకటి. ఈ రెండు కేసుల్లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు లేదా ఆదేశాలు నేరుగా కేంద్రాన్ని ప్రశ్నించాయి. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిలదీసాయి. ఇంతకన్నా ఘోరం మరోటి ఉండదు. ఎందుకంటే తమ చేతుల్లో ఉన్న అధికారాన్ని గుప్పిట పెట్టుకుని దర్యాప్తు సంస్థల ద్వారా లిక్కర్ కేసును అల్లిన తీరు చూస్తే ఇడి, సిబిఐల పరువు పోయింది. సిబిఐ అధికారిపై విచారణ చేయాలని ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు చూస్తే కేంద్రం సిగ్గుతో తలదించుకోవాలి. ఇక్కడ సిబిఐ ఇంత నిర్లక్ష్యంగా ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసినందుకు బాధపడాలి. అంటే దాని ప్రతిష్టను అదే దిగజార్చుకుంది. కనీస సమాచారం, దానికి తగ్గ అవసరమైన సాక్ష్యాలు లేకుండా ఓ కేసును గాలిలో మేడలు కట్టినట్లుగా అల్లడం వెనక ఎంతటి నిర్లక్ష్యం ఉందో తెలియచేసింది. రాజ్యాంగ పదవిలో ఉన్న సిఎం కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారు. ఉపముఖ్యమంత్రి సిసోడియాను జైలులో పెట్టారు.**

అంటే ఎంతటి దుర్మార్గానికి సిబిఐ, ఇడిలు ఒడిగట్టాయన్నది తేలిపోయింది. ఇదే విషయాన్ని జడ్జి ప్రశ్నించారు. నిజంగానే లిక్కర్ పాలసీ కేసు అన్నది ఓ అభూత కల్పన కేసు. అందులో ముడుపులు ముట్టాయనడానికి ఆధారాలు లేవు. ఈ కేసుతో సిబిఐ తన తీరును మార్చుకోవాలి. పక్కా సమాచారంతో కేసులను చేపట్టాలి. తద్వారా పోయిన ప్రతిష్టను ఇనుమడించేలా చేసుకోవాలి. ఇది సిబిఐ పరువే కాదు, దేశానికి సంబంధించి ప్రతిష్ట కూడా ఇందులో దాగి ఉంది. సిబిఐ సరిగా పనిచేస్తేనే, ప్రజలకు నమ్మిక ఉంటుంది. ఈ కేసులో ఆధారాలు ఉంటేనే హైకోర్టుకు వెళ్లడం మంచిది. అక్కడా భంగపడేకన్నా ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలి. ప్రాథమకి సమాచారం ఉంటేనే ముందుకు నడవాలి. రాజకీయ కక్షసాధింపులకు పాల్పడే కేసుల నుంచి సిబిఐ, ఇడిలలను దూరంగా ఉంచడం మంచిది. నిజానికి కెసిఆర్ హయాంలో జరిగిన అవినీతిపై కేసులు లేవు. జగన్ హయాంలో జరిగిన ఆర్థిక అవతవకతలపైనా కేసులు లేవు. ఇలాంటి వారి వల్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. వీటిపై చర్యలు తీసుకుంటే రాష్ట్రాల్లో పాలకుల్లో భయం ఉంటుంది. ఇకపోతే మరో కేసులో సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపాయి. జాతీయ, విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎన్‌సిఇఆర్‌టి ప్రచురించిన ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలో 'కరప్షన్ ఇన్ ది జ్యూడిషియరీ' అనే పాఠ్యాంశం తీవ్ర వివాదమైంది. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా విచారణకు





తీసుకోవడమే గాక.. ఆ సందర్భంగా ఆగ్రహంతో స్పందించిన తీరు, సిజెఐ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కుదిపేశాయి. 'న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా, ఉద్దేశ్య పూర్వకంగా చేసిన కుట్రగా ఇది కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది.' అని విచారణ సందర్భంగా సిజెఐ అన్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. జవాబుదారీతనం ఏర్పడేంతవరకు ఈ వ్యవహారాన్ని మేం వదలిబెట్టం. దీని వెనుక ఎవరున్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నామని సిజెఐ అనడం చూస్తుంటే..ఎంతటి నిర్లక్ష్యం ఉందో తేటతెల్లం అయ్యింది. ఈ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఆ చాప్టర్లను ఇద్దరు వ్యక్తులు రూపొందించారని, వారు యుజిసి లేదా మరే మంత్రిత్వ శాఖతోనూ కలిసి పనిచేయడం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణ ఇచ్చారు.ఆ పాఠ్యాంశాన్ని ముద్రించిన ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా నిషేధించాలని, ఇప్పటికే ప్రచురితమైన పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించడం ద్వారా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గట్టిగా నిలదీసినట్లు అయ్యింది. అయితే 8వ తరగతి పాఠ్యాంశం వంటిది హఠాత్పరి ణామం కాదు. గత దశాబ్ద కాలంగా ఎన్‌సిఇఆర్‌టి, ఇతర కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల చర్యలు తరచు వివాదాస్పదంగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే! పాఠ్యాంశాల్లో కొన్ని తొలగింపులు, అర్థరహిత మైన చేర్పులతో మీడియాలో పతాక శీర్షికల్లో వస్తూనే ఉన్నాయి. ఆయా సందర్భాల్లో చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలూ వాటిని ఎత్తిజూపి ప్రజలు, ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారు. ఇప్పుడు నేరుగా న్యాయ వ్యవస్థనే టార్గెట్ చేయడం, సుప్రీం ధర్మాగ్రహంతో కేంద్రం ఆత్మరక్షణలో పడింది. నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టవలసి వచ్చింది. ఈ రెండు వ్యవహారాల్లో కేంద్రం నేరుగా దొరికి పోయింది. కేజ్రీవాల్‌ను అణచివేసే కుట్ర జరిగిందన్న ఇక్కడ తెలిసిపోయింది. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పుట్టుకుని వచ్చిన కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. పంజాబ్‌లో పాగా వేశారు. దేశంలో అనేక చోట్ల ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను అవినీతి ముద్రతో అణివేసే ప్రయత్నం జరిగిందన్న వాదనలు వచ్చాయి. తెలంగాణలో కెసిఆర్ తనయ కవితను కూడా ఇందులో చేర్చారు. నిజానికి ఈ కేసు బలంగా ఉంటే కోర్టు ఇంత తీవ్రంగా వ్యాఖ్యలు చేసివుండేది కాదు. రాజకీయంగా తీసుకునే నిర్ణయాలకు సిబిఐ, ఇటి లాంటి వ్యవస్థలను దుర్వినయోగం చేయడం తగదు. ఇప్పటికైనా కేంద్రం తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు మేలుజరిగే మంచి పనులపై దృష్టి సారించాలి. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలి. అందుకు సమర్థవంతులైన అధికారులను నియమించుకోవాలి.

# 150 మందితో కూచిపూడి నృత్య ప్రదర్శన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

## అద్భుతమైన కళా ప్రదర్శనకు వేదికైన సంగారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..

ఆదివారం సంగారెడ్డి తార డిగ్రీ కళాశాల ఆవరణలో నక్షత్ర స్ఫూర్తి డాన్స్ అకాడమీ, వాసవి మా ఇల్లు సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏకకాలంలో 150 మంది విద్యార్థుల తో సామూహిక కూచిపూడి నృత్యం, సరస్వతి స్తుతి నిర్వహించారు.ఈ నృత్యం తో వారు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు కు అర్హత సాధించారు. ఈ అద్భుతమైన విజయం పట్ల ముఖ్య అతిథిగా హాజరైన టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 150 మంది కళాకారులు అద్భుతమైన నృత్యం చేశారని వారిని అభినందించారు. వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ ఈ అద్భుత ఘట్టంలో మేము ఒక భాగం కావడం






సంతోషదాయకం అని అన్నారు. ఈ ప్రదర్శన విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతుందని భారతీయ కళావైభవం వర్ధిల్లాలని ఆయన అన్నారు. టీచర్ యజ్ఞశ్రీ మాట్లాడుతూ తమ విద్యార్థుల విజయం అమోఘమని, భవిష్యత్తులో మరెన్నో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డికి, పిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్,సీఐ రాము నాయుడు,రాష్ట్ర యువజన సంఘాల అధ్యక్షులు కూన వేణుగోపాలకృష్ణ,వాసవి విద్యా సాగర్, ప్రకాష్,వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మాజీ వైస్ ఎంపీపీ తాండ లక్ష్మీనారాయణకు ఘన నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి సైదులు.



అక్షర కలం / ఇల్లందు.

ప్రజల మనిషి నిరాడంబరుడు ఇల్లందు మండలం విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీ భూపేష్ నగర్ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ తాండ్ర లక్ష్మీనారాయణ పార్థివ దేహానికి ఇల్లందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి సైదులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. మంచి మనిషి చనిపోవడం బాధాకరమని ఇతని మరణం పార్టీకే కాకుండా ఇల్లందు ప్రజలకు తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి సైదులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మండల మాజీ ఎంపీపీ మోకాళ్ళ వెంకటమ్మ, పసిక తిరుమల్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

# ఇల్లందు మునిసిపల్ కౌన్సిలర్ సోనీ సుదర్శన్ కోరిని ఘనంగా సన్మానించిన మాంటిసోరి హై స్కూల్ యాజమాన్యం.

అక్షర కలం / ఇల్లందు.



ఇల్లందు పట్టణంలోని 15 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ గా ఎన్నికైన సోనీ సుదర్శన్ కోరి దంపతులను ప్రముఖ పాఠశాల మాంటిసోరి హై స్కూల్ యాజమాన్యమైన ప్రముఖ విద్యావేత్త నేడుంతుండం, ప్రముఖ వైద్యులు డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదర్శన్ కోరి మూడు దఫాలుగా 15వ వార్డు కౌన్సిలర్ గా ఎన్నుకోబడి ఆ వార్డు ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ తన దగ్గరికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తూ మంచి కౌన్సిలర్ గా ప్రజా నాయకుడుగా గుర్తింపు పొందారు. నాలుగో సారి వచ్చిన మున్సిపల్ ఎన్నికలలో ఓటమి పొందారు. ఇటీవల ఐదవ సారి జరిగిన మున్సిపల్ ఎన్నికలలో15వవార్డు స్త్రీలకు రిజర్వేషన్ కావడంతో ఆయన సతీమణి సోనీ సుదర్శన్ కోరిని ఎన్నికలలో పోటీ చేయించాడని గతంలో చేసిన ఆయన చేసిన సేవలకు గాను,వార్డు అభివృద్ధిని గుర్తుంచుకున్న ప్రజలు సోనీ సుదర్శన్ కోరిని అత్యధిక మెజార్టీతో గెలిపించారని వారు పేర్కొన్నారు. గతంలో మునిసిపల్ ఫ్లోర్ గా పనిచేసిన సుదర్శన్ కోరి ఇల్లందు పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పని చేస్తున్నారు. ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అనుచరుడుగా ఆశీస్సులు మెండుగా ఉన్న సుదర్శన్ కోరి మాంటిసోరి పాఠశాల రహదారి, సైడు కాలువల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు చేయించేందుకు కృషి చేయాలని వారు కోరారు. సీనియర్ లీడర్ సుదర్శన్ కోరి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెంట్రల్ సిలబస్ హెచ్‌ఎం బిజ్జుయు, స్టేట్ సిలబస్ హెచ్‌ఎం నిషా, పాల్గొన్నారు.

# ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్,వార్డు కౌన్సిలర్లును ఘనంగా సన్మానించిన ఇల్లందు మాజీ మునిసిపల్ వార్డు కౌన్సిలర్ పర్రె శ్రీనివాస్ స్వర్ణలత దంపతులు.

అక్షర కలం / ఇల్లెందు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక 7 వార్డు, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ వార్డు కౌన్సిలర్ పర్రె స్వర్ణలత శ్రీనివాస్, దంపతుల ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ, గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య లక్ష్మి దంపతుల ఆశీస్సులతో, ఎన్నికైన ఇల్లందు పురపాలక సంఘం చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ దంపతులను ఘనంగా సన్మానం చేశారు. వారితో పాటు ఇల్లందు పురపాలక సంఘం వైస్ చైర్మన్ పెండ్యాల రాజు,పెండ్యాల హరికృష్ణ లను అంగరంగ వైభవంగా ఘనంగా సన్మానించారు. వారితో పాటు సుమారు 18 వార్డుల కౌన్సిలర్లను ఘనంగా శాలువా కప్పి సత్కరించారు. సన్మానం పొందిన వారిలో 1వ వార్డు కౌన్సిలర్ షేక్ సైదుమియా,3.వార్డు కౌన్సిలర్ అజ్మీర వంశీ, 4.వ వార్డు కౌన్సిలర్ కుష్బూబిమొన్న బాయ్, 5వ వార్డు కౌన్సిలర్ చల్లా భారతి శ్రీనివాస్, 6 వార్డు కౌన్సిలర్ రాధా కమల్ కుమార్ కోరి,7 గోపగాని రాజు గౌడ్, 8 వార్డు కౌన్సిలర్ రేఖ స్వరూప రవిశంకర్,9 వార్డు కౌన్సిలర్ గందే పద్మబిసదానందం, 10.వ కౌన్సిలర్ మెరుగు కార్తీక్ యాదవ్,11 వార్డ్ కౌన్సిలర్ మొగిలి లక్ష్మిబి ఈశ్వర్,15 వార్డు కౌన్సిలర్ సోనీ బాయ్ సుదర్శన్ కోరి,16 వార్డు కౌన్సిలర్ ముల్లంగి విజయలక్ష్మిబి సతీష్,20 వార్డు కౌన్సిలర్ ఎండి జాఫర్,21 వాటి కౌన్సిలర్ నీలపూ రమేష్,22 వార్డు కౌన్సిలర్ కొర్లపాటి కిరణ్, 24 వార్డు కౌన్సిలర్ శనిగారపు శృతి రమేష్ లు ఉన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పులిగండ్ల మాధవ రావు గారు, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్ కృష్ణ, పందిల వెంకన్న, బట్టు నగేష్, కాజా గౌస్ మొనుద్దీన్, వాంకుడోత్ వీరన్న, రేళ్ళ రవి, కంటే రాజు, చిలక సైదులు, దళితరత్న మేకల శ్యామ్ మాదిగ, నేలమర్రి నాగరాజు, కొండపల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు మాజీ వైస్ ఎంపీపీ తాండ్ర లక్ష్మీనారాయణకు ఘన నివాళి అర్పించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.

అక్షర కలం / ఇల్లెందు.



ఇల్లందు మాజీ వైస్ ఎంపీపీ తాండ్ర లక్ష్మీనారాయణ శనివారం ఉదయం అనారోగ్య కారణంతో ఉస్మానియా హాస్పిటల్ లో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ లు ఇల్లందుకు వచ్చి తాండ్ర లక్ష్మీనారాయణ పార్థివదేహాన్ని ఆదివారం సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. కుటుంబ సభ్యుల్ని ఓదార్చి ధైర్యంగా ఉండాలని పార్టీ మీ వెంట ఉంటుందని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే కూనంనేని వెంట సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె. సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, పట్టణ మండల కార్యదర్శులు బాస శ్రీనివాసరావు, బొప్పిశెట్టి సత్యనారాయణ, ఉపసర్పంచ్ కాసిం, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆలం రాఘవేంద్రరావు, ఉడుత ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రామాలయంలో ఉచిత మజ్జిగ ఏర్పాటు

అక్షర కలం/భద్రాచలం



వేసవికాలంప్రారంభమవుతున్న నేపథ్యంలో భక్తులసౌకర్యార్థంభద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారిదేవస్థానంవారు ప్రత్యేకఏర్పాట్లును చేపట్టింది. ఆలయానికిపెద్దసంఖ్యలో వచ్చే భక్తులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనంకలిగించేందుకు ఆలయం పరిసర ప్రాంతంలో ఉచిత మజ్జిగ వితరణకార్యక్రమాన్నిఆలయప్రారంభించారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించడం ద్వారాఎలాంటిఇబ ్బందులుకలగకుండాచర్యలుతీసుకుంటున్నట్లుదేవస్థానం అధికారులు తెలిపారు. ఈ ఉచిత మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని దేవస్థానం ఈఓ దామోదర్ రావు ప్రారంభించారు. వేసవి కాలం మొత్తం భక్తులకు నిరంతరం మజ్జిగ అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు.భకు ్తలుఈసదుపాయాన్నివినియోగించుకోవాలనిదేవస్థానం అధికారులు సూచించారు.

# రోడ్డు ప్రమాద బాధితుని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్


ఎల్లారెడ్డి, మార్చి-1 (అక్షర కలం )

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండి మాసానిపేట్ ఐదవ వార్డ్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోహిద్ గత రెండు రోజుల క్రితం తన ద్విచక్ర వాహన ప్రమాదంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం అతన్ని హైదరాబాద్ కు తరలించారు. హైదరాబాదులోని జిమ్ కేర్ ఆస్పత్రిలో చికిత్స మొహిద్ విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ ఆదివారం వారిని పరామర్శించి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి ఓదార్చారు.




అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట



# క్రీడా స్ఫూర్తికే విఘాతం

హుబ్లీ వేదికగా జమ్మూ కశ్మీర్, కర్ణాటక జట్ల మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ 2025–26 ఫైనల్ మ్యాచ్‌లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఆట రెండో రోజైన ఫిబ్రవరి 25న జమ్మూ కెప్టెన్ పారస్ డోగ్రా అత్యుత్సాహానికి పోయి కర్ణాటక ప్లేయర్ కేవీ అనీష్‌ను తలతో బలంగా కొట్టడం తీవ్రదుమారం రేపింది. టైటిల్ పోరులో ఇరు జట్లు హోరాహోరీగా తలపడుతున్న సమయంలో జరిగిన ఈ ఘటన క్రీడా స్ఫూర్తికే విఘాతం కలిగించేలా ఉంది.జమ్మూ కాశ్మీర్ ఇన్నింగ్స్ 101వ ఓవర్ వద్ద ఈ వివాదం మొదలైంది. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన బంతి పారస్ డోగ్రా బ్యాట్‌కు తగిలి బౌండరీకి వెళ్లింది. ఆ సమయంలో ఫార్వర్డ్ షార్ట్ లెగ్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ కేవీ అనీష్‌తో పారస్ డోగ్రాకు మాటల యుద్ధం జరిగింది. ఈ క్రమంలో సహనం కోల్పోయిన డోగ్రా.. అనీష్ దగ్గరికి వెళ్లి తలతో అతడి తలను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఒక్కసారిగా మైదానంలో వాతావరణం వేడెక్కింది.ఈ భౌతిక దాడిని చూసిన కర్ణాటక సీనియర్ ఓపెనర్ మయాంక్ అగర్వాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పారస్ డోగ్రా వైపు దూసుకెళ్లాడు. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో అంపైర్లు మధ్యలో వచ్చి ప్లేయర్లను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ కూడా డోగ్రాతో మాట్లాడి పద్ధతి మార్చుకోవాలని సూచించాడు. మరోవైపు కర్ణాటక కెప్టెన్ దేవదత్ పడిక్కల్ ఈ విషయంపై అంపైర్లకు అధికారికంగా ఫిర్యాదు చేశాడు.ఓవర్ ముగిసిన తర్వాత డోగ్రా తన తప్పు తెలుసుకుని అనీష్ వద్దకు వెళ్లి క్షమాపణలు చెప్పాడు. అయితే పారస్ డోగ్రా చేసిన పనికి తీవ్రంగా నొచ్చుకున్న అనీష్, ఆ క్షమాపణలను స్వీకరించడానికి నిరాకరించాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, డోగ్రాపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఫైనల్ వంటి పెద్ద మ్యాచ్‌లో ఇలాంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## పవర్‌ప్లేలో ప్రపంచ రికార్డుతో ఉగ్రతాండవం

పాకిస్తాన్ స్టార్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ షా అఫ్రిది తన పాత ఫామ్‌కు తిరిగొచ్చినట్లు కనిపిస్తోంది. ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్–8 మ్యాచ్‌లో పవర్‌ప్లేలోనే అద్భుతంగా బౌలింగ్ చేసి మ్యాచ్ ఆరంభంలోనే ఇంగ్లాండ్‌ను షాక్‌కు గురి చేశాడు. మూడు ఓవర్లలో మూడు వికెట్లు తీసి, వరల్డ్ రికార్డ్‌ను కూడా తన పేరిట రాసుకున్నాడు.ఇంగ్లాండ్ 165 పరుగుల లక్ష్యంతో చేజింగ్‌కు దిగిన వేళ, మ్యాచ్‌కు ముందు పేలవ ఫాంతో కనిపించిన షాహీన్ అఫ్రిది, ఇంగ్లాండ్ బ్యాటర్లను క్రీజ్‌పై నిలబడటం కూడా కష్టంగా మారేలా బౌలింగ్ చేశాడు. తొలి బంతి నుంచే పాత షాహీన్ అవతారం కనిపించింది.సెమీఫైనల్ కలతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను పవర్‌ప్లేలోనే షాహీన్ అఫ్రిది ఛిన్నాభిన్నం చేశాడు. తొలి ఓవర్ వేసిన షాహీన్, మొదటి బంతికే ఫిల్ సాల్ట్‌ను ఔట్ చేశాడు. టీ20 అంతర్జాతీయాల్లో తొలి బంతికే అత్యధిక వికెట్లు తీసిన రికార్డ్ ఇప్పటికే అతని పేరిట ఉంది. ఇప్పుడు ఆ రికార్డును మరింత పెంచుకున్నాడు. అంతేకాదు,

## రోహిత్ రికార్డుపై కన్నేసిన పాండ్యా

భారత సీనియర్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన తరం అత్యుత్తమ టీ20 క్రికెటర్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. బ్యాట్స్‌మన్‌గా అంతర్జాతీయ టీ20ల్లో 2000కి పైగా పరుగులు సాధించిన పాండ్యా, బౌలర్‌గా కూడా 100కి పైగా వికెట్లు పడగొట్టాడు. ఇప్పుడు ఫీల్డర్‌గా కూడా తన సత్తా చాటుతూ రోహిత్ శర్మ ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టేందుకు సిద్ధమవుతున్నాడు.గత పదేళ్లలో భారత జట్టు చిన్న ఫార్మాట్‌లో అజేయ శక్తిగా ఎదిగింది. ఈ కాలంలో ఆధునిక కాలపు సూపర్‌స్టార్లను భారత క్రికెట్ ప్రపంచానికి పరిచయం చేసింది. ఆ జాబితాలో హార్దిక్ పాండ్యా పేరు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. 2016లో ఆస్ట్రేలియాతో అడిలైడ్ వేదికగా జరిగిన మ్యాచ్‌తో హార్దిక్ పాండ్యా భారత్ తరఫున టీ20 ఫార్మాట్‌లో అరంగేట్రం చేశాడు. ఆ మ్యాచ్ నుంచి టీమిండియాలో కీలక సభ్యుడిగా మారాడు. అయితే గాయాల కారణంగా కొంతకాలం అతని ప్రదర్శనలకు బ్రేక్ పడింది. హార్దిక్ పాండ్యా ఇప్పటివరకు భారత్ తరఫున 134 అంతర్జాతీయ ు20× మ్యాచ్‌లు ఆడాడు. ఇది మూడు ఫార్మాట్లలో అతను ఆడిన అత్యధిక మ్యాచ్‌ల సంఖ్య. బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లో కూడా పాండ్యా ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 2024లో టీ20 క్రికెట్‌కు రిటైర్ అయ్యాడు. తన కెరీర్‌లో 159 టీ20ఐ మ్యాచ్‌లు ఆడి మొత్తం 65 క్యాచ్‌లు పట్టుకున్నాడు. ఇది భారత ఆటగాళ్లలో అత్యధిక క్యాచ్‌ల రికార్డు. 30–యార్డ్ సర్కిల్‌లో ఫీల్డింగ్ చేస్తూ సురక్షితమైన చేతుల జోడిగా రోహిత్ పేరుపొందాడు. ముఖ్యంగా యువ దశలో భారత్‌కు అతను వేగవంతమైన ఫీల్డర్‌గా గుర్తింపు పొందాడు. ప్రస్తుతం హార్దిక్ పాండ్యా 64 క్యాచ్‌లతో రోహిత్ రికార్డును అధిగమించే దశకు చేరుకున్నాడు. ఈ జాబితాలోని చాలా మంది ఆటగాళ్లు భారత క్రికెట్‌కు దీర్ఘకాలంగా సేవలందించిన సీనియర్ ప్లేయర్లు. కానీ రింకు సింగ్, తిలక్ వర్మ మాత్రం 2023లోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యువకులు. ఇప్పటివరకు 45 మ్యాచ్‌లు ఆడి ఇప్పటికే ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకోవడం వారి అద్భుతమైన ఫీల్డింగ్‌కు నిదర్శనం.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# సినిమా
CINEMA

## ఆరా ఆఫ్ ఉస్తాద్ రెండో పాట విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గురించి దర్శకుడు హరీష్ శంకర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా జరుపుకుంటుంది. ఇందులో భాగంగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.పవన్ కళ్యాణ్ రెండు దశాబ్దాలుగా మెడపై చెయ్యి వేసుకునే మేనరిజాన్ని గుర్తు చేస్తూ, దానికి మాటల రూపం ఇవ్వాలనే ఆలోచనతోనే 'నేను మెడ ముట్టుకుంటే తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ వచ్చిందన్నారు.






## హుషారు పిట్టలు నుంచి మంగళస్నానం పాట విడుదల

అన్ను మరియు వాసవి గణెలిషన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిల్మ్స్ విడుదల చేస్తుండటంతో ట్రేడ్ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన టీజర్‌కు భారీ స్పందన రాగా, తాజాగా ఈ చిత్రం నుంచి 'మంగళస్నానం' అనే హార్ట్ టచింగ్ ఎమోషనల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. పాట ఒక తండ్రి తన కూతురిని ఎంత అల్లారుముద్దుగా పెంచుకుంటారో, ఆమెపై ఎంతటి ప్రాణాన్ని పెట్టుకుంటారో అద్భుతంగా ఆవిష్కరించింది. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే విడదీయలేని అనుబంధానికి ఈ గీతం అద్దం పడుతోంది. ఎస్.ఎస్. చిరంజన్ హృద్యమైన సాహిత్యం అందించగా, యోగి సురేష్ మరియు విహా తమ గాత్రంతో ప్రాణం పోశారు. చరణ్ అర్జున్ అందించిన సంగీతం ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పాట విడుదల సందర్భంగా దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 'తండ్రీకూతుళ్ల మధ్య ఉండే స్వచ్ఛమైన ప్రేమను ఈ పాటలో చూపించాం. ఈ సినిమా కేవలం యువతకే కాదు, తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక చక్కని కుటుంబ కథా చిత్రం. నా నిజ జీవితంలో నేను చూసిన యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించాను. యువతకు కావాల్సిన హుషారును ఇస్తూనే, ఒక సరికొత్త థ్రిల్‌ను ఈ సినిమా పంచుతుంది' అని తెలిపారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ.. 'సినిమా ప్రథమార్థం అంతా యూత్‌ఫుల్ కంటెంట్‌తో ఎంట్టంల్గ÷న్ చేస్తే, ద్వితీయార్థంలో ఒక మెచ్యూర్డ్ పాయింట్ ఉంటుంది. సమాజంలో బాధ్యతాయుతమైన విషయాన్ని వినోదాత్మకంగా చెప్పే ప్రయత్నం చేశాం. ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూశాక ఒక బాధ్యతను గుర్తిస్తారు. నటీనటులందరూ చాలా సహజంగా నటించారు. కచ్చితంగా ఇది పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం మాకుంది' అని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో అన్ను, వాసవి గణెలిషన్‌లతో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## విష్ణు విన్యాసం మూవీ లీక్

'విష్ణు విన్యాసం' మూవీ లీక్ అవడం వల్ల చాలా విషయాలు జరిగాయని అందుకే వారం గ్యాప్‌తో తన రెండు సినిమాలు విడుదల చేయాల్సి వచ్చిందని శ్రీవిష్ణు తెలిపారు. ఆయన కథానాయకుడిగా యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో రూపొందిన కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. నయన్ సారిక కథానాయిక. తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ మూవీ చక్కటి వినోదాన్ని పంచుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీవిష్ణు మాట్లాడారు. 'సినిమా లీక్ అవడం వల్ల షూటింగ్ హడావుడిగా అయిందన్నారు. స్క్రిప్ట్‌లో ఏమైనా మార్పులు చేశారా' అని అడగ్గా, 20 రోజుల పనిని ఏడు రోజుల్లో రాత్రి, పగలూ విరామం లేకుండా చేయాల్సి వచ్చింది. టీమ్ అంతా సహకారం అందించారు. అలా చేస్తేనే ఈ టైమ్‌కు రాగలిగాం. పూర్తి ఎ÷–లానింగ్ లేకుండా ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టాల్సి వచ్చింది. దానివల్లే రెండు సినిమాలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చాయి. చెన్నై నుంచి ఈ సినిమాను లీక్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. దీనిపై కేసు నడుస్తోంది. మా నిర్మాతని బ్లాక్ మెయిల్ చేశారు. ఆయనను బెదిరిస్తూ వాళ్లు పెట్టిన సందేశాలు, ఛాంబర్‌కు మేము చేసిన ఫిర్యాదులు అన్నీ మా దగ్గర ఉన్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించాలి. ప్రతి రీల్‌కు నిర్మాతను బ్లాక్ మెయిల్ చేశారు. విడుదల ముందురోజు వరకూ ఇదంతా జరిగింది. ఆ విషయంలో నిర్మాత చాలా ఇబ్బందిపడ్డారు. అలాగని మమ్మల్ని ఆందోళనకు గురి చేయలేదు' అని శ్రీవిష్ణు తెలిపారు.నిర్మాత సుమంత్ నాయుడు మాట్లాడుతూ.. 'వరుసగా ఈ సినిమాకు సంబంధించిన వీడియోలను నాకు పంపారు. ఆ సందేశాలు చూడగానే నా భవిష్యత్ కళ్ల ముందు కనపడింది. మా యూనిట్ నుంచే తెలియకుండా సన్నివేశాలు వెళ్లిపోయాయి. మాకు సినిమా క్లిప్‌లను పంపిన నెంబర్‌ను ట్రేస్ చేశాం. ఆ తర్వాత ఛాంబర్‌లో ఫిర్యాదు చేశాం. చాలా మానసిక క్షోభ అనుభవించాం. పరిస్థితి అదుపు తప్పడంతోనే మిగిలిన షూటింగ్ వేగంగా పూర్తి చేసి, ఈ సినిమాను తీసుకురావాల్సి వచ్చింది. అంతేకానీ, 'మృత్యుంజయ్' మూవీకి పోటీగా దీన్ని విడుదల చేయాలన్న ఉద్దేశం మాకు లేదు. ఆ చిత్ర నిర్మాత పరిస్థితిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా అని అన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# మిడ్ డే మీల్స్ అమలులో యాదాద్రి ముందంజ

యాదాద్రి భువనగిరి అక్షర కలం

స్థాయిలో పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకం (ప్రధాన మంత్రి పోషణ్ ) అమలులో యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలో ఉత్తమ స్థానంలో ఉండి, శనివారం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ సత్కారం అందుకున్నారు. 2025-26 సంవత్సరంలో యాదాద్రి భువనగిరి జిల్లా మధ్యాహ్న భోజనం / పీ.ఎం. పోషణ్ యొక్క స్మార్ట్, వినూత్న మరియు సమర్థవంతమైన అమలును ప్రోత్సహించడానికి,

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ మరియు రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ సమగ్ర శిక్ష ద్వారా అత్యుత్తమ కార్యకర్తలను గుర్తించి సత్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇద్దరు జిల్లా విద్యాశాఖ అధికారులను, ఇద్దరు మండల విద్యా అధికారులను, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను,ముగ్గురు ప్రధానోపాధ్యాయులను, ఒక కంప్యూటర్ ఆపరేటర్ ను మరియు రెండు స్వయం సహాయక బృందాలను గుర్తించి సత్కరించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఈ సత్కారం పొందిన ఇద్దరు డీ.ఈ.ఓ ల్లో యాదాద్రి భువనగిరి జిల్లా డిఈఓ మొదటి వారుగా ఉన్నారని అన్నారు. ప్రశంసనీయమైన పనితీరు, అంకితభావం మరియు వివిధ స్థాయిలలో పథకం యొక్క ప్రభావవంతమైన అమలుకు గుర్తింపుగా ఈ సత్కారాన్ని అందుకున్నారని ఆయన తెలిపారు. ఈ గుర్తింపు, క్షేత్ర స్థాయి అధికారులను సిబ్బందిని ప్రోత్సహించడం, జవాబుదారీతనం, శ్రేష్ఠతను ప్రోత్సహించడం కోసం ఉద్దేశించబడిందని ఆయన అన్నారు. ఈ సత్కారం, రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల పిల్లలకు పోషకాహారాన్ని సమర్థవంతంగా అందించడంలో మరింత బలోపేతం చేయడంలో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్ ) ఎం.మదన్మోహన్, అడిషనల్ డైరెక్టర్ ఉషారాణి తదితరులు



పాల్గొన్నారు .

## సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



అక్షర కలం బీబీనగర్

బీబీనగర్ మండలం రాఘవాపూర్ నుండి లక్ష్మిదేవి గూడెం, బ్రాహ్మణపల్లి మీదుగా ఎర్రబెల్లి తండావరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీబీనగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురకంటి సత్తి రెడ్డి, నాయకులు పొట్టోల శ్యాం గౌడ్ లు మాట్లాడుతూ భువనగిరిఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి సహకారంతో సీసీ రోడ్డు మంజూరు అయినట్టు వారు తెలిపారు. సీసీ రోడ్డు పనులను నాణ్యతతో పాటు త్వరతగతిన పూర్తి చేయడానికి సహకరిస్తున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి వారు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు కు ఇరువైపులా పంట పొలాలు ఉండడంతో సీసీ రోడ్ ను మంజూరు చేయడంతో రోడ్ పాడవకుండా చాలా సంవత్సరాల వరకు నాణ్యతతో ఉంటుందని వారన్నారు. అయా గ్రామాల ప్రజలు ఎన్నో సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న రోడ్ ప్రారంభం అవడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ లు సిద్దగోని శ్రీకాంత్ గౌడ్ బీబీనగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్మిడి ఇంద్రా రెడ్డి, గూడూరు మహిపాల్ రెడ్డి, జిల్కపల్లి భాను సుధాకర్, ఉప సర్పంచ్ లు సిలివేరు కవిత మహేష్, జిల్లాల మహిపాల్ రెడ్డి, కొక్కలగొండ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు బడ్జెట్‌లో రూ. 50 వేల కోట్లు కేటాయించాలి



అక్షరకలం దేవరకొండ:

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ. 50 వేల కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దేవరకొండలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలన్నారు. బీసీ సబ్ ప్లాన్ అమలు చేసి, సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలు అందించాలి. కాంట్రాక్టు పనుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న రూ. 8,500 కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలి అని డీమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయురాలిపై ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయుడు

అక్షరకలం దేవరకొండ

తనను మానసిక వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఒక ఉపాధ్యాయుడు తన ప్రధానోపాధ్యాయురాలిపై జిల్లా విద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే ఉపాధ్యాయుడు కె. జగ్రామ్ తన వ్యక్తిగత విషయాలపై ప్రధానోపాధ్యాయురాలు నిత్యం ఫోకస్ పెడుతూ, పని విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అత్యవసర సమయంలో సెలవు కోసం దరఖాస్తు చేసుకున్నా అనుమతించడం లేదని, తోటి ఉపాధ్యాయుల ముందు అభ్యంతరకర పదజాలంతో దూషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా తన మిత్రుడి పదవీ విరమణ కార్యక్రమానికి వెళ్లడానికి సెలవు అడగగా, "మిగతా వారికి ఇస్తాను కానీ నీకు మాత్రం ఇవ్వను" అంటూ వివక్ష చూపారని వాపోయారు. తనపై జరుగుతున్న ఈ మానసిక వేధింపులపై విచారణ జరిపి, సదరు ప్రధానోపాధ్యాయురాలిపై కఠిన చర్యలు తీసుకోవాలని జగ్రామ్ జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు.

## కృషి ఉంటే విజయం సాధ్యమే: సాయి రిత్విక్‌ను అభినందించిన కుకూడాల కవిత

అక్షరకలం దేవరకొండ



దేవరకొండ పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ ప్రజ్ఞ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి నారమోని సాయి రిత్విక్ సాధించిన అద్భుత విజయానికి గాను ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యం విద్యార్థిని ఘనంగా సన్మానించింది. క్రమశిక్షణతో కూడిన విద్య, నిరంతర కృషితోనే ఈ విజయం సాధ్యమైందని ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రతినిధులు కొనియాడారు.

ప్రజ్ఞ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకురాలు కుకూడాల కవిత సాయి రిత్విక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రిత్విక్ ప్రతిభను కొనియాడుతూ, విద్యార్థికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు లక్ష్యశుద్ధితో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆమె ఈ సందర్భంగా విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. రిత్విక్ సాధించిన ఈ విజయం ఇన్‌స్టిట్యూట్‌కు గర్వకారణమని, భవిష్యత్తులో విద్యార్థి మరిన్ని ఉన్నత విజయాలు సాధించి, సమాజానికి సేవ చేయాలని కుకూడాల కవిత ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని రిత్విక్‌కు అభినందనలు తెలియజేశారు.

## సిసి రోడ్లు ప్రారంభం చేసిన సర్పంచ్ సోలిపురం ఎల్లారెడ్డి



ఆత్మకూరు (ఎం) అక్షర కలం

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని మోదుగుకుంట గ్రామంలో సీసీ రోడ్లు ప్రారంభం చేసిన సర్పంచ్ సోలిపురం ఎల్లారెడ్డి ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనలో గ్రామాలు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసరి దయాకర్ రెడ్డి , కార్యదర్శి స్వామి,వార్డ్ మెంబర్లు సోలిపురం తిరుమలరెడ్డి, ధనలక్ష్మి , ఉడుత చంద్రకళ ,పల్లె సైదులు రెడ్డి,మల్లెపూల మంగమ్మ, నర్సమ్మ ,శ్రీశైలం గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నల్లగొండ కార్పొరేషన్ 41వ డివిజన్ కార్పొరేటర్ గా ఘన విజయం సాధించిన కేసాని వేణుగోపాల్ రెడ్డి



అక్షరకలం నల్లగొండ

విద్యానగర్ వసుధ టవర్స్ అపార్ట్మెంట్ వాసులు కార్పొరేటర్ గా ఘనవిజయం సాధించిన కేసాని వేణుగోపాల్ రెడ్డి కి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి పూల బొకే అందజేశారు. గతం లో మున్సిపల్ కౌన్సిలర్ గా వేణుగోపాల్ రెడ్డి పార్టీలకతీతంగా అభివృద్ధి చేయడం తో పాటు, నిత్యం ప్రజల మధ్య అందుబాటులో ఉంటారని అపార్ట్మెంట్ వాసులు కొనియాడారు. ఎవరికి ఏ ఆపద వచ్చిన వెంటనే స్పందించేతత్వం వేణుగోపాల్ రెడ్డి సొంతం అని.. అందుకే నూతనంగా ఏర్పడిన నల్లగొండ కార్పొరేషన్ లోనూ కార్పొరేటర్ గా ఘన విజయం సాధించారని గుర్తు చేశారు. అందరికీ ఆత్మీయుడుగా గుర్తింపు పొందిన వేణుగోపాల్ రెడ్డి భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని పదవులు అధిష్టించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వసుధ టవర్స్ అపార్ట్మెంట్ వాసులు మేరెడ్డి జనార్దన్ రెడ్డి, తుమ్మల లింగస్వామి, యరెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, లోట్లపల్లి కోటయ్య, దాయం భూపాల్ రెడ్డి, సత్తిరెడ్డి, వాసుదేవుల ప్రఖ్యాత్, రమేష్, చంద్రశేఖర్ రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన దోటి కిరణ్ యాదవ్

అక్షరకలం, చండూరు

చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు నివాసి కొలుగూరి వెంకటేష్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న బీజేపీ మున్సిపల్ నాయకులు, 1వ వార్డు అభ్యర్థి దోటి కిరణ్ కుమార్ యాదవ్ వెంటనే వారి నివాసానికి చేరుకుని, వెంకటేష్ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెబుతూ తన వంతు సామాజిక బాధ్యతగా రూ. 10,000 (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటూ అనునిత్యం ప్రజల సేవలో అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు అన్నెపర్తి యాదగిరి, మాదగోని స్వామి, కాలనీవాసులు కల్లెట్ల రవి, మొగుదాల ధశరథ, దోటి శివ, దోటి మల్లేష్, దోటి లింగయ్య, నేతాల వెంకన్న, కన్నెగోని శ్రీకాంత్, బిజెపి నాయకులు సోమ రాజు, గందూరి మల్లేష్, భూతరాజు వేణు, దోటి అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మికతతోనే "సమాజం"లో ఐక్యత

### రాములబండ బ్రహ్మోత్సవాల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

### జూన్ నాటికి శ్రీశైలం సొరంగ మార్గం పూర్తి

### మంత్రి కోమటిరెడ్డి కీలక ప్రకటన

### గ్రామస్తులతో కలిసి స్వామివారి రథాన్ని లాగిన మంత్రి

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆ శ్రీరాముడిని ప్రార్థించినట్లు రోడ్డు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం నల్గొండ మండల, రాములబండ గ్రామంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి హాజరై గ్రామస్తులతో కలిసి స్వామివారి రథాన్ని స్వయంగా లాగి ప్రారంభించారు. గ్రామంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తుల సందడి మధ్య భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామస్తులంతా ఏకమై ప్రతీ ఏడాది బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సత్సంబంధాలను పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. శివాజీ





మహారాజ్ ధైర్యసాహసాలకు, దేశభక్తికి ప్రతీక అని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి తెలిపారు. జూన్ నాటికి శ్రీశైలం సొరంగ మార్గం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, నల్గొండ తహసిల్దార్ పరుశురాం, నల్గొండ మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, స్థానిక సర్పంచ్ చామకూరి శంకర్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమం, విద్యాభ్యాసానికి అత్యంత ప్రాధాన్యత

### జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 01:

సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం, విద్యాభ్యాసానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బాలుర సమీకృత వసతి గృహంపై వెలువడిన వార్తల నేపథ్యంలో ఆదివారం వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి భోజన సరఫరా, త్రాగునీరు, వసతి, వంటశాల ఏర్పాట్లను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి మాట్లాడుతూ, వసతి గృహంపై వెలువడిన వార్తల నేపథ్యంలో వసతి గృహాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించడం జరిగిందని, హాస్టల్ స్థాయిలో పర్యవేక్షణ, సమన్వయంలో తాత్కాలిక లోపం కారణంగా భోజన సరఫరా, కొంతమంది ప్రాథమిక సౌకర్యాలలో అంతరాయం ఏర్పడినట్లు గమనించడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టడం జరిగిందని, విద్యార్థులకు నిరంతర భోజన సరఫరా, శుద్ధమైన త్రాగునీరు, వసతి, వంటశాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం వసతి గృహంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, సంబంధిత వసతి గృహ సంక్షేమ అధికారి,



సిబ్బందిని కఠినంగా హెచ్చరించడం జరిగిందని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే బాధ్యులపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జరిగిన సంఘటనకు బాధ్యులైన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఛత్రపతి శివాజీ పౌరుషానికి, వీరత్వానికి ప్రతీక

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.

### రాములబండలో శివాజీ విగ్రహావిష్కరణ

### యువత దేశభక్తిని అలవర్చుకోవాలన్న మంత్రి

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**





చత్రపతి శివాజీ మహారాజ్ వీరత్వానికి, పౌరుషానికి ప్రతీక అని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు అన్నారుఆదివారం నల్గొండ మండలం రాములబండ గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల రథోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం ఆయన గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చత్రపతి వీర శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత కలసికట్టుగా గ్రామ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహ ఏర్పాటు స్థలదాత పల్లె సుగుణమ్మ, విగ్రహ దాత వంగాల కిరణ్ కుమార్ గౌడ్, చత్రపతి శివాజీ కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ మాజీ జెడ్పిటిసిలు గుమ్ముల మోహన్ రెడ్డి, వంగూరు లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, సర్పంచ్ చామకూరి శంకర్ గౌడ్, బొబ్బలి ప్రకాష్ రెడ్డి,చత్రపతి శివాజీ కమిటీ చైర్మన్ గూడూరి ఉమారెడ్డి, వైస్ చైర్మన్ బొంత వెంకన్న,కార్యదర్శి పల్లె వెంకట్ రెడ్డి, కోశాధికారి బొబ్బలి నరసింహారెడ్డి, వరికుప్పల రాజు, కృష్ణంరాజు,మహేష్, బొబ్బలి వెంకట్ రెడ్డి,పల్లె కృష్ణారెడ్డి, బొబ్బలి గణేష్ రెడ్డి, చామకూరి రామయ్య, మాజీ ఎంపిటిసి చిలక రాజు బిక్షం, బొబ్బలి గణేష్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులుపాల్గొన్నారు.

# నేడు దేవరకొండలో నీటి సరఫరా నిలిపివేత

**అక్షరకలం దేవరకొండ**

దేవరకొండ పట్టణ ప్రజలకు మునిసిపల్ యంత్రాంగం ముఖ్య గమనికను జారీ చేసింది. కోదండాపురం పంప్‌హౌస్ వద్ద అత్యవసర మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో, సోమవారం (మార్చి 2, 2026) రోజున పట్టణవ్యాప్తంగా నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ పూర్ణ చందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోదండాపురం పంప్‌హౌస్ వద్ద ఉన్న ప్రధాన వాల్వ్‌ల రిపేర్ పనులు, నీటి నిల్వ ట్యాంకుల క్లీనింగ్ (శుభ్రం చేయడం) ప్రక్రియను చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ పనుల కారణంగా సోమవారం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు.పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి ముందస్తుగా నీటిని నిల్వ చేసుకోవాలని, అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వాడుకోవాలని కమిషనర్ కోరారు. మరమ్మతులు పూర్తయిన అనంతరం యథావిధిగా నీటి సరఫరా పునరుద్ధరించబడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# క్రీడా పోటీల్లో మోడల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**మందమర్రి, మార్చి 01 అక్షర కలం ప్రతినిధి:**



పట్టణంలోని కార్మెల్ ఉన్నత పాఠశాలలో శనివారం ఫాదర్ జోలీ ఫాదర్ చాకో జ్ఞాపకార్థం నిర్వహించిన వాలీబాల్, కోకో క్రీడా పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ (మోడల్) పాఠశాల విద్యార్థులు కోకో క్రీడా పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి, ద్వితీయ బహుమతి సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్మీన్ తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఆదివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్మీన్ మాట్లాడుతూ, ఈ పోటీల్లో మందమర్రి, బెల్లంపల్లి, కాసీపేట, నెన్నెల నాలుగు మండలాల నుంచి 10 ప్రభుత్వ పాఠశాలల నుంచి150 విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా, పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి కోకో క్రీడా పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు. పోటీల అనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మందమర్రి సిఐ పర్సా రమేష్, సింగరేణి ఫారెస్ట్ అధికారి ఆర్ నవీన్ కుమార్ లు విద్యార్థులను అభినందించారు. క్రీడలు విద్యార్థుల దేహదారుడ్యానికి, శారీరక పుష్టికి, మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని తెలిపారు. చదువుతోపాటు ఆటలలో సైతం విద్యార్థులు రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బండి ప్రకాష్, నారాయణ కు ఘన స్వాగతం పలికి, సన్మానించిన పట్టణ ప్రముఖులు





**మందమర్రి/చెన్నూరు మార్చి01 అక్షర కలం ప్రతినిధి:-**

మాజీ మావోయిస్టు అగ్రనేతలు మందమర్రి ఏరియా నివాసులు జనజీవన స్రవంతిలో అడుగుపెట్టిన బండి ప్రకాష్, అబ్బాసి నారాయణ తో ఆత్మీయ సమ్మేళనంలో మందమర్రి ప్రముఖులు ఆదివారం వారికి ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని సి.ఈ.ఆర్ క్లబ్ లోనికి డప్పు చప్పుళ్ళతో వారికి ఘన స్వాగతం పలికిన మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, సింగరేణి రిటైర్మెంట్ కార్మిక నాయకులు. మిత్ర బృందం ఆధ్వర్యంలో బండి ప్రకాష్, నారాయణ దంపతులకు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి.

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చి , 01)**



నారాయణ పేట జిల్లా మక్తల్ మండలం జౌలాపురం గ్రామ బీజేపీ నాయకులు గత సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ డా బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి మా గ్రామానికి ముఖ్య రహదారి అయిన జక్లేర్ వెళ్ళే రహదారి గుంతలమయమైందని మరమ్మతులు చేయాలని కోరగా బీజేపీ సర్పంచ్ అభ్యర్థిని గెలిపిస్తే ఖచ్చితంగా సొంత నిధులతో మరమ్మత్తు చూపిస్తానని ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం భూమిపూజ చేసి మరమ్మతుల పనులు ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో జౌలాపురం సర్పంచ్ బాలకిస్టప్ప ఉపసర్పంచ్ హనుమంతు మరియు గ్రామపెద్దలు బీజేపీ నాయకులు మరియు బీజేపీ మక్తల్ మండల అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి నారాయణ పేట జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ జాక్లేర్ శేఖర్ రెడ్డి మరియు నర్వ మండల బీజేపీ నాయకులు మాజీ ఎంపీటీసీ నీరజ్ , నర్వ మండల ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్ (లంకల్ ఉప సర్పంచ్) కోశాధికదికారి నాగన్న , యాదవ రెడ్డి , మాజీ నర్వ మండల ప్రధాన కార్యదర్శి రాం పురం నరసింహ , చాకలి బోజన్న , పల్లె రాంరెడ్డి వాసా సతీష్ గారు బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు అండగా ప్రభుత్వం

**మునుగోడులో సబ్సిడీ వ్యవసాయ పరికరాల పంపిణీ**

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా రైతులకు యంత్రాల అందజేత**

**ఐదు మండలాల పరిధిలో 98 మంది లబ్ధిదారులకు ప్రయోజనం**



**అక్షరకలం చౌటుప్పల్**

రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆధునిక వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై యంత్ర పరికరాలను అందిస్తున్నామని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో నల్గొండ జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి రైతులకు ఈ పరికరాలను అందజేశారు. మునుగోడు నియోజకవర్గంలోని ఐదు మండలాలు మునుగోడు, చండూరు, నాంపల్లి, మర్రిగూడ, గట్టుప్పల్. చెందిన రైతులకు ఈ పథకం కింద పరికరాలు మంజూరయ్యాయి. బ్యాటరీ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, రోటవేటర్లు, కల్టివేటర్లు, ఎం.బి. ప్లవ్, కేజీ వీల్స్, పవర్ గ్రేడర్లు, బ్రష్ కట్టర్లు వంటి అత్యాధునిక పనిముట్లను రైతులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు వ్యవసాయ యాంత్రీకరణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. రైతులు ఈ సబ్సిడీ పరికరాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, చండూరు ఆర్డీవో శ్రీదేవి, వ్యవసాయ శాఖ ఏడీ వేణుగోపాల్ తో పాటు వివిధ మండలాలకు చెందిన ఏవోలు, ఏఈవోలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులైన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు పై గుంతలను పూడ్చి వేయించిన కౌన్సిలర్

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

భువనగిరి పట్టణంలోని 22వ వార్డులో రోడ్డు పై ఉన్న పెద్ద పెద్ద గుంతలను వార్డు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ ఆదివారం ఆర్ అండ్ బీ అధికారుల సహకారంతో పూడ్చి వేయించారు.



భువనగిరి పట్టణంలోని నల్లగొండ చౌరస్తా, న్యూ రాంనగర్ లో రోడ్డు పై ఉన్న గుంతలు ప్రమాదకరంగా మారడంతో , బాటసారులు ఇబ్బందులు గురి అవుతున్నారని తెలుసుకున్న కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే అనిల్ రెడ్డి, 22వ వార్డు లోని గుంతల రోడ్లను పూడ్చి వేయాలని రోడ్డు అండ్ భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్ అండ్ బీ అధికారులు వార్డు లోని గుంతల రోడ్లు పూడ్చి వేసారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, 8వ వార్డు కౌన్సిలర్ తాహెరా మజర్ పాషా, బట్టు మహేందర్, వరుణ్, సాదిక్, సాయి రత్నాకర్ శివతేజ రోడ్లు భవనాల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యావ్యవస్థలో నూతన అధ్యాయం

**'యంగ్ ఇండియా' ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమిపూజ**

**దేశమంతా మనవైపే చూసేలా విద్యా విప్లవం**

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**200 కోట్లతో అత్యాధునిక పాఠశాల.. 2,500 మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య**



**అక్షరకలం చౌటుప్పల్**

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమూలంగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడులోని దుబ్బ కాలువ రోడ్డులో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' నిర్మాణానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, టీజీ ఈ డబ్ల్యూ ఐడీసీ ఎంజీ గణపతి రెడ్డిలతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారుఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ కేంద్రంలో ఇంతటి భారీ ప్రాజెక్టు రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. "రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో 79 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ప్రారంభమవుతున్నాయి. వీటి ద్వారా సుమారు 2 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇంతటి గొప్ప పథకాన్ని తెచ్చిన సీఎంకు మునుగోడు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాను అని అన్నారు.?చిన్నతనంలో మనం చదువుకున్నప్పుడు కులమతాల భేదం ఉండేది కాదు. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు కూడా అదే స్ఫూర్తితో అన్ని వర్గాల విద్యార్థులను ఒకే ప్రాంగణంలోకి చేరుస్తాయని అన్నారు. గత ప్రభుత్వం విద్య, వైద్యాన్ని గాలికి వదిలేసిందని, కేవలం ప్రాజెక్టుల పేరుతో అప్పులు చేసి సీమాంధ్ర కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చిందని విమర్శించారు.



?ప్రస్తుతం 50 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ సంస్థల్లో చదువుకునేలా మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని, ఇందుకోసం బడ్జెట్‌లో 10–15 శాతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు.

**రాజకీయాల 'టైగర్ జోన్....**

నల్గొండ జిల్లా రాష్ట్ర రాజకీయాలను శాసించే 'టైగర్ జోన్' అని రాజగోపాల్ రెడ్డి అభివర్ణించారు. హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్నా మునుగోడు అభివృద్ధిలో వెనుకబడిందని, ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం నియోజకవర్గ అభివృద్ధికి పడే మొదటి అడుగని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రెండేళ్లలో ఈ పాఠశాల నిర్మాణం పూర్తి చేసి, నాణ్యమైన విద్యను పేద విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# బుద్ధవనం చేరుకున్న ధమ్మా పాదయాత్ర....

## ఎమ్మెల్యే జైవీర్ తో కలిసి ఘనంగా స్వాగతం పలికిన మల్లేపల్లి లక్ష్మయ్య...

## 403 కిలోమీటర్లు బౌద్ధులతో నడిచిన స్వాతి (శునకం)...

అక్షర కలం నాగార్జునసాగర్ / నందికొండ:--





గౌతమ బుద్ధుని శాంతి సందేశంతో ప్రజలను మేల్కొల్పుతూ సాగిన మూడవ దమ్మయాత్ర ఆదివారం సాయంత్రానికి బుద్ధవనం చేరుకుంది. దమ్మయాత్ర బుద్ధవనం చేరుకున్న సందర్భముగా స్థానిక శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మానస స్వర్ణ లతో కలిసి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య దమ్మయాత్ర బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. బంజారా నృత్యాలతో, కోలాటాలతో, ఒగ్గు కళాకారుల నృత్యాలతో, స్థానికులు, బౌద్ధ అభిమానులు అధిక సంఖ్యలో దమ్మయాత్ర బృందానికి అడుగు అడుగున పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 403 కిలోమీటర్లు పాదయాత్ర తో వచ్చిన థాయిలాండ్, భారతీయ బౌద్ధ భిక్షువులుకు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో బుద్ధవనములోని అశోక ధర్మ చక్రం వద్ద బౌద్ధ భిక్షువుల పాదాలను కడిగారు. థాయిలాండ్ నుండి బౌద్ధ దమ్మయాత్ర ద్వారా తీసుకురాబడిన బుద్ధ ధాతువులను బుద్ధ వనం ప్రధాన ద్వారం నుండి స్థానిక శాసనసభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి, నందికొండ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మానస స్వర్ణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, గగన్ మాలిక్ ఫౌండేషన్ అధ్యక్షులు గగన్ మాలిక్, సిద్ధార్థ లతో కలిసి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య బుద్ధ ధాతువులను ఊరేగింపుగా తీసుకువచ్చి మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో సందర్శకుల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు. మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిలను వెలిగించిన అనంతరం ధ్యానం చేశారు. ఈ సందర్భంగా బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ సంఘ థాయిలాండ్ అధ్యక్షులు పర సంగ్ సక్ కోవిడో ప్రధాన బౌద్ధ భిక్కు ఆధ్వర్యంలో థాయిలాండ్ భిక్షువులు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన భిక్షులతో సుమారు 403 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించి బుద్ధవనం చేరుకున్నారన్నారు. థాయిలాండ్ రాజకుటుంబం నుండి మహా థాయ్ ఈ దమ్మయాత్రకు సహకారం అందించారని తెలిపారు. గగన్ మాలిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గగన్ మాలిక్ దమ్మయాత్రకు ప్రారంభం నుండి ముందుండి నడిపించారన్నారు. అక్షయ ఫౌండేషన్ అధ్యక్షులు సిద్ధార్థ హిట్టెంబరి, లతరాజా ఫౌండేషన్ అధ్యక్షులు కేకే రాజా దమ్మ యాత్ర విజయవంతం చేసేందుకు భాగస్వాములు అయ్యారని తెలిపారు. బి ఎస్ ఐ తెలంగాణ అధ్యక్షులు పరంధాములు ఆధ్వర్యంలో బి ఎస్ ఐ సభ్యులు తెలంగాణలో కొనసాగిన దమ్మయాత్రకు సేవలు అందించారని అన్నారు. 29 రోజులు పాటు కొనసాగిన దమ్మయాత్రలో "సాతి" అనే శునకం బౌద్ధ బిక్షువులతో పాటు నడుస్తూ పాదయాత్రలో పాల్గొని ప్రత్యేకతను చాటుకుందన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధ వనం ఆర్ట్స్ మరియు ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందర్రావు, బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, స్థానిక సీఐ శ్రీను నాయక్, ఎస్సై ముత్తయ్య, స్థానిక కౌన్సిలర్లు, బౌద్ధాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సామన్ పల్లి , కాట్రాన్ పల్లి గ్రామాలలో భూమి పూజ చేసిన బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మార్చి, 01)

నారాయణ పేట జిల్లా మక్తల్ మండలం సామన్పల్లి, కాట్రాన్పల్లి గ్రామ బీజేపీ నాయకులు సర్పంచ్ ఎన్నికల ముందు మా గ్రామాలకు ఐమాక్స్ లైట్లు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ డా బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ని కోరగా సర్పంచ్ ఎన్నికల్లో గెలిచి వస్తే ఐమాక్స్ లైట్లు సొంత నిధులతో వేయిస్తానని మాట ఇచ్చిన ప్రకారం ఆయా గ్రామాలలో వచ్చే 10 రోజుల్లో లైట్లు ఏర్పాటుకు ఈరోజు భూమి పూజ చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి . ఇట్టి కార్యక్రమం లో ఆయా గ్రామాల సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు వార్డు సభ్యులు ఆయా గ్రామాల పెద్దలు బీజేపీ నాయకులు కార్యకర్తలు బీజేపీ మక్తల్ మండల అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి నారాయణ పేట జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ , మరియు నర్వ మండల బీజేపీ నాయకులు నర్వ మండల ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్ (లంకల్ ఉప సర్పంచ్) , కోశాధికదికారి నాగన్న యాదవ రెడ్డి , మాజీ ఎంపీటీసీ నీరజ్ , మాజీ నర్వ మండల ప్రధాన కార్యదర్శి రాం పురం నరసింహ చాకలి బోజన్న , పల్లె రాంరెడ్డి వాసా సతీష్ గారు పాల్గొన్నారు.

## ఓదెల మల్లికార్జున స్వామి ఆశీస్సులతో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

ఓదెల మల్లన్నకు కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకున్న...

పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి మార్చ్ 01 (అక్షర కలం)

ఓదెల శ్రీ.మల్లికార్జున స్వామి వారిని ఆదివారం రోజున పావని దంపతులు కుటుంబ మరియు సపరివార సమేతంగా తమ ఇంటి ఇలవేల్పు అయిన ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ నిర్వహించి మొక్కులు చెల్లించుకున్న గౌరవ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ముందుగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.. తదుపరి బోనాలు సమర్పించుకొని ,పట్నాలు వేసి స్వామివారిని కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే విజయరమణా రావు కొలిచారు...అనంతరం ఆలయ కమిటీ పక్షాన మెమొంటోలు స్వామివారి కండువాలతో ఎమ్మెల్యే విజయరమణా రావు వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీకట్ల మొండయ్య, ఈవో సదయ్య, డైరెక్టర్లు కట్కూరి సమ్మిరెడ్డి , కొండ శ్రీనివాస్, జంగం కొమురయ్య, ఉప్పుల శ్రావణ్ కుమార్, తాళ్లపల్లి శ్రీనివాస్, గంట రమేష్, జీలక రవి, మనోహర్ రావు, సామల యమున హరికృష్ణ, ఈరవేణి రవి, తీర్తాల రాజారామ్, ప్రధాన అర్చకులు ధూపం వీరభద్రయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రావు, సర్పంచులు, పాల్గొన్నారు.

## బిజెపి పట్టణ కమిటీలో ఇరువురికి చోటు

మందమర్రి, మార్చి 01 అక్షర కలం ప్రతినిధి:

భారతీయ జనతా పార్టీ (బిజెపి) పట్టణ కమిటీలో పట్టణ ఉపాధ్యక్షుడిగా గాదె రాములు, ప్రధాన కార్యదర్శిగా శనిగారపు శ్రీనివాస్ లను నియమించడం జరిగిందని పార్టీ పట్టణ అధ్యక్షుడు సప్పడి నరేష్ తెలిపారు. ఈ మేరకు రాములు, శ్రీనివాస్ లకు ఆదివారం పట్టణంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్తూ, పార్టీ బలోపేతానికి కృషి



చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా నియమితులైన రాములు, శ్రీనివాస్ లు మాట్లాడుతూ, తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్, పార్టీ జిల్లా నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలపై పోరాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దేవరనేని సంజీవ్ రావు, సీనియర్ నాయకులు డివి దీక్షితులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 01:



సివి రామన్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని బెల్లంపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులందరూ ఎప్పటికప్పుడు విజ్ఞానాన్ని పెంచుకుంటూ, సృజనాత్మకంగా ముందుకు సాగాలని అప్పుడే ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో విజయతలగా నిలుస్తారని విద్యార్థులకు సూచించారు. ప్రైమరీ, హై స్కూల్ నుండి 200 కు పైగా వివిధ రకాల సైన్స్ ప్రాజెక్ట్ మోడల్స్ ని తయారు చేసి ప్రదర్శించి, తమ సృజనాత్మక శక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం అరవింద్ రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ నాగరాజు, ప్రిన్సిపాల్ రాజేష్, డీన్ సతీష్, సి బ్యాచ్ ఇంచార్జ్ శ్రీనివాస్, ప్రైమరీ ఇంచార్జ్ సౌజన్య, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ పల్లవి, వ్యాయామ ఉపాధ్యాయులు రాంబాబు నాయక్, శ్యామల, సతీ సుమ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సాయికుంట బీసీ హాస్టల్ విద్యార్థుల నిరసన

వార్డెన్ ను విధుల నుంచి తొలగించాలి

పిడిఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి శ్రీకాంత్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 01:



జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని సాయికుంటలో గల బీసీ ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలో ఆదివారం హాస్టల్ విద్యార్థులు వసతి గృహం గేటు ముందు బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. హాస్టల్లో తమకు సరిపడా భోజనం పెట్టడం లేదని, వార్డెన్ తమతో వంట చేయిస్తున్నారని, హాస్టల్లో అపరిశుభ్రత వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిని భాగ్యవతి హాస్టల్ ను సందర్శించి, పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, పరిస్థితులను పరిశీలించారు. హాస్టల్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సంఘటనపై ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, విద్యార్థులచే పనులు చేయిస్తున్న హాస్టల్ వార్డెన్ ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

## ఫోరం ఫర్ ఆర్.టి.ఐ రాష్ట్ర అధ్యక్షుడిగా తాళ్లపల్లి రమేష్ గుప్తా నియామకం

బాధ్యతయుత పాలనకు సమాచార హక్కు చట్టం కీలకం - డాక్టర్ కొమ్మోజు రమేష్

మేడ్చల్, మార్చి 1 (అక్షరకలం):



మేడ్చల్లో ఫోరం ఫర్ ఆర్టిఐ, హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏజీయస్ అసోసియేట్స్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు టి.రమేష్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ కొమ్మోజు రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె. వెంకట వేణు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కొమ్మోజు రమేష్ మాట్లాడుతూ సమాజంలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనకు సమాచార హక్కు చట్టం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టాన్ని ప్రజలు ఎలా వినియోగించుకోవాలి, దరఖాస్తులు ఎలా ఇవ్వాలి, అప్పీలు ఏ విధంగా వెళ్లాలి అనే అంశాలపై సభ్యులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. అలాగే మానవ హక్కుల ప్రాముఖ్యత గురించి వివరించి, ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకొని వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె. వెంకట వేణు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారం దిశగా సంస్థ సభ్యులు పనిచేయాలని సూచించారు. ఎవరైనా ప్రజలు తమ సమస్యలతో రాష్ట్ర అధ్యక్షులు లేదా జిల్లా అధ్యక్షులను సంప్రదించినప్పుడు ఆ సమస్యను రాతపూర్వకంగా స్వీకరించి చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్య సరైనదని భావిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సభ్యులకు సూచించారు. సమాచార హక్కు చట్టం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా తాళ్లపల్లి రమేష్ గుప్తా, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కె. స్వాతి,ఎన్.సతీష్ రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్గా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, ప్రసాద్, సుధాకర్ రెడ్డి, బిజెపి నాయకులు, ఆర్టిఐ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ కనకదుర్గ ఆలయం వార్షికోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



అక్షర కలం : చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల పట్టణంలోని శ్రీ కనకదుర్గ ఆలయ కమిటీ పాలకవర్గం ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను ఆయన నివాసంలో కలిసి కనకదుర్గ అమ్మవారి వార్షిక మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న దేవస్థానం 23వ వార్షిక మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఉత్సవాలను ప్రారంభించాలని ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహోత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వాసుదేవ శర్మ, డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకాంతం నరసింహారెడ్డి, రుద్రారం లింగస్వామి, జిట్టా సాయిలు, వనమా నిఖిల్ కుమార్, నాయకులు బెల్లి సత్తయ్య, పన్నాల రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన విజయ్ కుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం

కోమటిరెడ్డి ప్రతాప్ రెడ్డి ని అభినందించిన గ్రామస్తులు

అక్షర కలం బీబీనగర్



బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యం తో మృతి చెందిన ఉగ్గి విజయ్ కుమార్ కుటుంబానికి, మాజీ వి ఆర్ ఓ కోమటిరెడ్డి ప్రతాప్ రెడ్డి ఆదివారం యాభై వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన విజయ్ కుమార్ మరణంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని భావించిన ప్రతాప్ రెడ్డి నగదు తో పాటు 50 కేజీ ల బియ్యం అందజేసారు. ఈ సందర్భంగా మానవత్వంతో మరణించిన విజయ్ కుమార్ కుటుంబానికి అర్థిక సాయం చేసిన కోమటిరెడ్డి ప్రతాప్ రెడ్డి ని పలువురు జైనపల్లి గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో జైనపల్లి గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో జూదంపై ఉక్కుపాదం....

- టాస్క్ ఫోర్స్ దాడుల్లో 9 మంది అరెస్ట్.....

- రూ.28,296 నగదు, 6 మొబైల్ ఫోన్లు, ఒక కారు, 5 బైక్లు స్వాధీనం....



- మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు....

**నర్సాపూర్ /కౌల్చారం మార్చి 01 (అక్షర కలం):-**

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బుజరాంగ్‌పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.విశ్వసనీయ సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మంది జూదగాళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.28,296 నగదు మరియు 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని వడ్ల ఎల్లం, వంజరి మల్లేశం, ఉసికె దుర్గేష్, బక్క వీరేశం, మహంకాళి ప్రకాష్, గుడాల హరి, పనిముక్కలా రామ్ శశిధర్ గౌడ్, గంగారాం మల్లేశం, జాతీగరి కృష్ణగా పోలీసులు గుర్తించారు. వారిని కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పేకాట, బెట్టింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి అక్రమాల వల్ల అనేక కుటుంబాలునష్టపోతున్నాయని, ముఖ్యంగా యువత తప్పుదారుల్లోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# ఆందోళనకరంగా సాయి కుంట బీసీ హాస్టల్లోని పరిణామాలు

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 01:**



జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని సాయికుంట లోని బీసీ ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలో జరుగుతున్న పరిణామాలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని విద్యార్థి జన సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బచ్చలి ప్రవీణ్ కుమార్ ఆదివారం ప్రకటనలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు పురుగులు, రాళ్లు కలిసిన అన్నం, నీళ్ల పప్పు వంటి అత్యంత నాణ్యతలేని ఆహారం అందిస్తున్నారని విద్యార్థుల నిరసన, వాంగ్మూలాలతో స్పష్టమవుతోందని తెలిపారు. ఇది కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాకుండా, విద్యార్థుల ఆరోగ్యం, ప్రాణాలపై జరుగుతున్న వ్యవస్థాగత దాడి అని తెలిపారు. వసతి గృహ వార్డెన్ విద్యార్థుల తోనే వంట పనులు చేయించుకుంటూ, కనీస పరిశుభ్రత ప్రమాణాలు పాటించకుండా, భోజనం తయారు చేయిస్తున్నారని ఆరోపించారు. వంటశాల, భోజనశాల, హాస్టల్ పరిసరాలు పూర్తిగా అపరిశుభ్రంగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని తెలిపారు. బీసీ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు సక్రమంగా వినియోగం కావడం లేదనే అనుమానాలు ఈ ఘటనతో మరింత బలపడుతున్నాయన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థుల జీవితాలతో ఇలా చెలగాటం ఆడటం నేరమని తెలిపారు. ఈ ఘటన పై వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులైన వార్డెన్ తో పాటు సంబంధిత అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వసతి గృహాల్లో ఆహార నాణ్యత, పరిశుభ్రత పై శాశ్వత పర్యవేక్షణ వ్యవస్థను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

# ప్రయాణికుల సౌకర్యార్థం చలువ పందిర్లు ఏర్పాటు



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 01:**

జిల్లా కేంద్రమైన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సిసిసి కార్నర్ వద్ద మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు, మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ల ఆధ్వర్యంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఆదివారం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని స్థానికులు సమస్యను మేయర్ దృష్టికి తీసుకురాగానే తక్షణమే స్పందించి మున్సిపల్ అధికారులను ఆదేశించి, కేవలం ఒక్కరోజులోనే చలువ పందిళ్లు ఏర్పాటు చేయడం పట్ల ప్రయాణికులు, స్థానికులు హర్ష వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నేతృత్వంలో కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ ప్రజా సమస్యలపై తక్షణ స్పందించే విధానాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మధుకర్ మాట్లాడుతూ, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

## ఘనంగా మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**



మూడు దశాబ్దాల మాదిగ రిజర్వేషన్ వర్గీకరణ పోరాటంలో అమరులైన మాదిగలను స్మరిస్తూ ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద సంస్మరణ దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశానుసారం ప్రతి సంవత్సరం మార్చి ఒకటిన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుతున్నామన్నారు. మాదిగ అమరవీరుల స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ సంపాదించుకొని, దానిని అమలు చేసుకొని రాజ్యాంగం కల్పించిన ఫలాలను అనుభవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్రె సుదర్శన్, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు నల్ల చంద్రస్వామి, ఇంజ మహేష్, మైనారిటీ నాయకులు బబ్లూ, అమ్జద్, ఎమ్మార్పీఎస్ నాఇటుకల దేవేందర్, పడిగల ప్రదీప్, నల్ల కృష్ణ, బండారు శివ శంకర్, తదితరులు పాల్గొన్నారు

# హక్కుల సాధనకు “ఐద్వా”

ఐద్వా మహిళా సంఘంలో సభ్యులుగా చేరండి

హక్కుల సాధనకై ఉద్యమించండి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపు



**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

మహిళల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న (ఐద్వా) మహిళా సంఘంలో సభ్యులుగా చేరాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఒకరోజు సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాడు నల్లగొండ మండలం చందనపల్లి గ్రామంలో సభ్యత్వ చేర్పింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళలకు పార్లమెంట్‌లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల పరిస్థితిపై మహిళలతో చర్చించారు. ఉపాధి కూలీలకు రోజుకు కేవలం రూ.30 మాత్రమే ఇవ్వడం అన్యాయమని విమర్శించారు. కనీసం రోజుకు రూ.300 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై రాష్ట్రవ్యాప్తంగా పనులను పరిశీలించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు. మహిళలంతా ఐక్యమై తమ సమస్యల పరిష్కారానికి ఐద్వా ఆధ్వర్యంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ దేశంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలు ఉన్నప్పటికీ మహిళలను రెండవ పౌరురాలిగా చూస్తూ తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. మహిళలంతా సంఘటితమై ఈ దౌర్జన్యాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మద్యం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యువతీ యువకులు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నల్లగొండ మండల కార్యదర్శి కొండా అనురాధ, జిల్లా కమిటీ సభ్యురాలు తంతెనపల్లి సైదమ్మ, మహిళా నాయకురాళ్లు ఉప్పుల సరోజన, విశ్వనాధుల లక్ష్మీదేవి, కొడదల లక్ష్మీదేవి, జంజరాల కొండమ్మ, దోమల పెల్లి శోభ, పగిడి పాల కోటమ్మ, కొండ కవిత, కొల్లు సన్నమ్మ, అనసూర్య, తంతనపల్లి పూలమ్మ, స్వర్ణ, కొండ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల వన దుర్గ అమ్మవారిని దర్శించుకున్న.... - రిజిస్టర్ ఆఫ్ కోఆపరేటర్ సొసైటీ చైర్మన్ రాహుల్ రాజ్ దంపతులు.....

**కొల్చారం, మార్చి 01 (అక్షర కలం):-**



రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ కమీషనర్ రాహుల్ రాజ్ ఆదివారం ఏడుపాయల వన దుర్గ భవాని మాత అమ్మవారి నీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు ఆలయ కార్యనిర్వహణ అధికారి అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా రిజిస్టర్ కోఆపరేటివ్ సొసైటీ కమిషనర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారి ఆలయం ఎంతో చారిత్రాత్మక ఆలయంగా ప్రసిద్ధికెక్కిందని, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి విచ్చేస్తారని భక్తుల కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం గా విరాజిల్లుతుందని మహిమాన్విత వన దుర్గ భవాని అమ్మవారి ఆశీస్సులతో జిల్లాలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆకాంక్షించారు.

# మంబోజి పల్లి సంతలో ఐదు తులాల బంగారు నగల చోరీ....

-రూ.8లక్షల విలువ గల నగలు అపహరణ....

**కొల్చారం, మార్చి01,(అక్షర కలం):-**

మెదక్ జిల్లా మంబోజి పల్లి సంతలో 5తులాల బంగారు ఆభరణాలు చోరి అయిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన కొల్చారంకు చెందిన చింతలగారి శ్రావణి ప్రవీణ్ భార్య భర్తలు మెదక్ వెళ్లి తిరిగి ప్రయాణం లో సంతలో కూరగాయలు తీసుకోవడానికి వెళ్ళారు. తమ వద్ద ఉన్న హాండ్ బ్యాగులో ఉన్న రూ.8లక్షల విలువ గల 5తులాల బంగారు నగలు నెక్లెస్ 2.5, నల్లపూసలు 2తులలు,మాటీలు,చెవి కమ్మలు అర తులం చోరి జరిగాయి . బాధితులు కొద్దిసేపటి కి హ్యాండ్ బ్యాగ్ చూడగా కనిపించకుండా పోవడంతో కంగుతిన్న బాధితులు మెదక్ లో రూరల్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై లింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

# అంకమ్మ తల్లి తిరునాళ్లకు కోమట్లగూడెం సిద్ధం

మార్చి 1--5 వరకు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు

**అక్షర కలం/ చింతకాని:**




ఖమ్మం జిల్లా చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ లక్ష్మి అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు మార్చి 1 నుండి 5 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.గత 28 సంవత్సరాలుగా సంప్రదాయబద్ధంగా జరుగుతున్న ఈ మహోత్సవాలు ప్రాంతీయ ఆధ్యాత్మిక వేడుకగా గుర్తింపు పొందాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామం మొత్తం ఉత్సవ శోభతో కళకళలాడనుంది.మహోత్సవాల తొలి రోజు మహాభిషేకం, ప్రత్యేక పూజలు, స్వామివారి ఊరేగింపు నిర్వహించబడతాయి. మార్చి 2న ఉదయం తీర్థప్రసాదం, అనంతరం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామివారి కళ్యాణం ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, ప్రసాదం, పార్కింగ్ వంటి ఏర్పాట్లు చేపట్టినట్లు టీ సభ్యులు వెల్లడించారు.మార్చి 3న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించబడతాయి. మార్చి 5న “డాన్స్ బేబీ డాన్స్” పోటీలు జరగనున్నాయి. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేయబడతాయి. పోటీల నిర్వహణకు అవులూరి రామిరెడ్డి, రాయల శ్రీను, వేముల జానకిరాములు సమన్వయ బాధ్యతలు చేపట్టారు.జాతర ప్రారంభోత్సవాన్ని చింతకాని సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వీరేందర్ ప్రారంభించనున్నారు. మహోత్సవాల నిర్వహణలో దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు చురుకుగా పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# నల్గొండ వేదికగా “సీఐటీయూ” సమరభేరి

మార్చి 14, 15 తేదీల్లో 13వ జిల్లా మహాసభలు

కార్మిక హక్కుల రక్షణే ధ్యేయం.. 500 మంది ప్రతినిధులతో భారీ సదస్సు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

తుమ్మల వీరారెడ్డి







**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**

పోరాటాల పురిటిగడ్డ నల్గొండ పట్టణంలో ఈ నెల 14, 15 తేదీల్లో సీఐటీయూ 13వ జిల్లా మహాసభలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి ప్రకటించారు. ఆదివారం సీఐటీయూ నల్గొండ జిల్లా విస్తృతస్థాయి సమావేశం దొడ్డి కొమరయ్య భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల పోరాటాల సారథి సిఐటియు నల్లగొండ జిల్లా 13 వ మహాసభలు పోరాటాల పురిటీగడ్డ నల్లగొండ పట్టణంలో 2026 మార్చి14,15 తేదీలలో జరుగుతున్నాయని తెలిపారు.ఈ మహాసభలలో జిల్లాలోని 33 మండలాల నుండి జిల్లావ్యాపితంగా వివిధ యూనియన్స్ నుండి 500 మంది ప్రతినిధులు, అఖిల భారత మరియు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని అన్నారు.ఐక్యత పోరాటం నినాదంతో 1970 లో సిఐటియు ఏర్పడినప్పటి నుండి దేశంలో కార్మికవర్గ హక్కుల కోసం అనేక పోరాటాలు చేసింది. సిఐటియు కేవలం కార్మికుల హక్కులే కాకుండా, రైతాంగము, వ్యవసాయ కార్మికులు, సామాజిక సంఘాల పోరాటాలకు సంఘీభావంగా అండగా నిలుస్తుంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకరణ విధానాలకు వ్యతికంగా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్నది. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే విధంగా 2020 సంవత్సరంలో పార్లమెంట్లో బిల్లు 29 కార్మిక చట్టాలను రద్దు పరిచే విధంగా పార్లమెంటులో చట్టం తెచ్చి నాలుగు లేబర్ కోడ్లను అమలుకు ప్రయత్నిస్తున్నది ఈ విధానాలకు వ్యతిరేకంగా గత ఐదు సంవత్సరాలుగా దేశంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున కార్మికుల పోరాటాల ఫలితంగా వాటిని నివారించగలుగుతున్నాం. స్వాతంత్రం నాటినుండి ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే విమానయానం ఓడరేవులు టెలికం ఇన్సూరెన్స్ బొగ్గు గనులు బ్యాంకింగ్ ఉక్కు పరిశ్రమలు అన్నింటిని కారు చౌకగా (అంబానీ ఆదానీలకు) కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పుతు దేశ సంపదను సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ పరిశ్రమలతో పాటు 73 షెడ్యూల్డ్ పరిశ్రమలలో గత ఏడు సంవత్సరాలుగా కనీస వేతనాలు జీవోలను సవరించటం లేదు. గ్రామపంచాయతీ మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అశా, అంగన్వాడీ మధ్యాహ్నభోజన కార్మికులు, విఓఏ, ఉపాధి హామీ, ఫీల్డు అసిస్టెంట్ లతో పాటు అనేక రకాలు పార్ టైమ్, గౌరవ వేతన ఉద్యోగులకు వేతనాలు పెంచటం లేదు. భవన నిర్మాణం, హమాలీ, ట్రాన్స్పోర్టు, కార్మికులు సంక్షేమము గాలికి వదిలేసినది. అన్నిరకాల అసంఘటిత కార్మికుల హక్కులు కాలరాయబడుతున్నది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సంఘటిత అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికులకు అనేక వాగ్దానాలు చేసినది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వాగ్దానాల అమలు కు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో కార్మిక వర్గం తీవ్ర అసంతృప్తికి గురి అవుతున్నదని అన్నారు.జిల్లాలో రాబోవు రోజుల్లో కార్మికుల పక్షాన మరిన్ని పోరాటాలు ఆందోళనలు నిర్వహించేందుక 14,15 తేదీలలో నల్లగొండ పట్టణంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలు వేదికగా కానున్నాయి. ఈ మహాసభలో కార్మికుల ఆర్థిక, సామాజిక సమస్యలపై చర్చలు జరగనున్నాయి. కార్మిక, కర్షక మైత్రి ద్వారానే పాలకుల దుష్ట విధానాలను తిప్పికొట్టగలమని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి సలీం జిల్లా కోశాధికారి బాణాల పరిపూర్ణాచారి జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికార్ మల్లేష్, అవుత సైదులు సహాయ కార్యదర్శులు దండెంపల్లి సత్తయ్య, చింతపల్లి బయన్న మల్లు గౌతమ్ రెడ్డి, నల్ల వెంకటయ్య, ఏర్పుల యాదయ్య, పెంజర్ల సైదులు, రొండి శ్రీను, భూలక్ష్మి, వెంకటమ్మ, బొందు పార్వతి, సునీత, లకపాక రాజు, పోలే సత్యనారాయణ, అవుట రవీందర్, అద్దంకి నరసింహ, ఆదిమల్ల సుధీర్, జేరిపోతుల ధనంజయ్, వరికుప్పల ముత్యాలు, ఎస్.కె బషీర్, పొన్న అంజయ్య, సర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అడవి సెగలో.. “వసంత రాగం”

## హోలీకి ప్రకృతి సిద్ధమైన ‘మోదుగు’ హారం





ఇరగబోసిన మోదుగు... హోలీకి సహజ రంగుల హారం. వసంత ఋతువుకు ప్రతీకగా ఎర్రటి అగ్నివర్ణంతో విరబూసే (మోదుగు పువ్వు) హోలీ పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అడవుల్లో అగ్నిశిఖలలా మెరిసే ఈ పూలతో సహజ రంగులు తయారు చేసి హోలీ ఆడే సంప్రదాయం మన సంస్కృతిలో ఉంది. రసాయన రంగుల బదులుగా మోదుగు పూలను ఎండబెట్టి లేదా నీటిలో నానబెట్టి తయారు చేసే కాషాయ రంగు చర్మానికి హానికరం కాకుండా, ఆరోగ్యానికి మేలు చేస్తుందని పెద్దలు చెబుతున్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సహజ రంగులతో జరుపుకునే హోలీ పండుగ ఆనందానికి, పర్యావరణ పరిరక్షణకు నిదర్శనం. నల్గొండ మండలం రాములబండలో అక్షర కలం కెమెరాకు దర్శనమిచ్చిన మోదుగు పువ్వు చెట్టు.

అక్షరకలం కెమెరామెన్... నల్గొండ.

# నాగోల్‌లో నీటి లీకేజ్‌తో వ్యాపారాలు స్థంభనం

- మూసీ నది వంతెన సమీపంలో మూడు నెలలుగా తీవ్ర ఇబ్బందులు....!!

గిరిరాజు - రాజస్థాన్ మార్బిల్స్ ప్రొప్రైటర్





**ఉప్పల్, మార్చి 01(అక్షర కలం)**

:హైదరాబాద్ నగరంలోని నాగోల్ పాయింట్ వద్ద, మూసీ నది వంతెన సమీపంలో గత మూడు నెలలుగా నీటి లీకేజ్ మరియు డ్రైనేజీ లైన్ సమస్య తీవ్రంగా కొనసాగుతోంది. గోడౌన్ ముందుభాగంలో భారీ గుంత ఏర్పడటంతో లోపలికి, బయటికి రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రజలు ప్రాణాల్ని పణంగా పెట్టి గుంతను దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.
ఈ విషయంపై రాజస్థాన్ మార్బిల్స్ ప్రొప్రైటర్ గిరిరాజు మాట్లాడుతూ, "నీటి లీకేజ్ కారణంగా నా గోడౌన్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. గత మూడు నెలలుగా వ్యాపారం పూర్తిగా స్థంభించింది. అద్దె, సిబ్బంది జీతాలు, కూలీల వేతనాలు చెల్లించాల్సి వస్తున్నప్పటికీ ఆదాయం లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను" అని వాపోయారు. స్థానిక వ్యాపారులు మరియు ప్రజలు ఈ సమస్య ఎప్పుడైనా పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నీటి లీకేజ్, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# పూజల హరికృష్ణ ప్రొద్భలంతో తడ్కపల్లి గ్రామానికి ట్రాన్స్ఫార్మర్ మంజూరు

రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

రైతుల సమస్యలను పట్టించుకోని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ

**అక్షర కలం సిద్దిపేట మార్చి 01:**



సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి గ్రామానికి చెందిన రైతులు గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ని కలిసి తమ సమస్యను విన్నవించారు. రైతుల సమస్యలను శ్రద్ధగా విన్న పూజల హరికృష్ణ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామానికి 63 కెవి ట్రాన్స్ఫార్మర్ మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టారు. ట్రాన్స్ఫార్మర్ మంజూరు కావడంతో తడ్కపల్లి గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తూ పూజల హరికృష్ణ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు.గతంలో రైతుల సమస్యలను పట్టించుకోని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు నిర్లక్ష్య వైఖరి కారణంగానే గ్రామాల్లో ఇలాంటి సమస్యలు కొనసాగాయని విమర్శించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి గ్రామ అభివృద్ధే తమ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో తడ్కపల్లి గ్రామ రైతులు ఄ కాంగ్రెస్ నాయకులు తడ్కపల్లి మహేష్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్శ రాములు,శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అణు పరీక్షల ధీశాలి వాజ్‌పేయి..

## ఖమ్మం సభలో వెంకయ్య నాయుడు సంచలన వ్యాఖ్యలు

కులం కంటే గుణమే మిన్న.. విలువల్లేని రాజకీయాలపై మాజీ ఉపరాష్ట్రపతి ఆవేదన

అమ్మను పరభాషలో పిలిస్తే శవంతో సమానం.. మాతృభాష ప్రాధాన్యతపై ఉద్ఘాటన

తక్షణ ఆహారంతో నిరంతర రోగాలు.. పాశ్చాత్య సంస్కృతిపై యువతకు దిశానిర్దేశం

క్రమశిక్షణే అత్యున్నత పదవులకు సోపానం.. తన రాజకీయ ప్రస్థానాన్ని నెమరువేసుకున్న వెంకయ్య నాయుడు.

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని అద్భుతమైన వక్త, రచయిత, కవి, ప్రజాస్వామ్యవాది, గొప్ప దేశభక్తుడు అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కొనియాడారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన వాజ్‌పేయి శతజయంతి పుస్తకావిష్కరణ సభలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవుల కోసం పీఠాల కోసం వాజ్‌పేయి ఎప్పుడూ రాజీపడలేదని, ఓటమిని సైతం అత్యంత హుందాగా స్వీకరించిన గొప్ప వ్యక్తిత్వం ఆయన సొంతం అని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన మనసుతో దేశ సేవ చేయాలని ఆకాంక్షించిన గొప్ప నాయకుడు ఆయన అని ప్రశంసించారు. వాజ్‌పేయి హయాంలోనే దేశవ్యాప్తంగా స్వర్ణ చతుర్భుజి రహదారుల నిర్మాణం, గ్రామీణ రహదారుల అనుసంధానం, సమాచార ప్రసార రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. ప్రపంచ దేశాల ఆంక్షలను ఏమాత్రం లెక్కచేయకుండా రాజీలేని ధోరణితో పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించిన ధీశాలి వాజ్‌పేయి అని ఉద్ఘాటించారు. దేశంలో ఒకే విధానం ఉండాలనే శ్యామప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా కాశ్మీర్‌లో కల్పిస్తున్న ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం ఒక గొప్ప చారిత్రక ఘట్టం అని అభివర్ణించారు. వాజ్‌పేయి పాలనా దక్షత, నిస్వార్థ సేవ నేటి తరానికి ఆదర్శం కావాలని ఆకాంక్షించారు.గతంలో జనసంఘ్, కమ్యూనిస్ట్, కాంగ్రెస్, స్వతంత్ర పార్టీ వంటి రాజకీయ పక్షాలకు ఒక నిర్దిష్టమైన సిద్ధాంతం ఉండేదని, నేటి రాజకీయాల్లో ఆ సిద్ధాంతాలు పూర్తిగా లోపించాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కేవలం అవకాశవాదంతో పక్షాలు మారుతున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కులము కన్నా గుణము మిన్న అని స్పష్టం చేస్తూ రాజకీయాల్లో కులం, ధనం, మతం, నేరచరిత్ర ఆధారంగా కాకుండా నాయకుడి వ్యక్తిత్వం, సామర్థ్యం, యోగ్యత, ప్రవర్తన చూసి ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రలోభాలకు లొంగకుండా సరైన నాయకులను ఎన్నుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని సూచించారు. ప్రస్తుత ప్రసార మాధ్యమాలు కేవలం వివాదాలకు ఇస్తున్న ప్రాధాన్యత సమాజానికి మేలు చేసే మంచి విషయాలకు ఇవ్వడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమాజంలో మంచిని ప్రోత్సహించే బాధ్యత పత్రికలదే అని హితవు పలికారు. విలువలతో కూడిన రాజకీయాలు మాత్రమే దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలవని ఆయన విశ్లేషించారు.ప్రతి ఇంట్లో పిల్లలు తప్పనిసరిగా మాతృభాషలోనే మాట్లాడాలని స్పష్టం చేశారు. పరభాషా పదమైన అమ్మను సూచించే ఆంగ్ల పదం వాడితే వస్తుప్రదర్శనశాలలో పెట్టే శవం అని అర్థం వస్తుందని, అమ్మ, నాన్న అని పిలవడంలో ఉన్న కమ్మదనం ఆంగ్ల పదాల్లో ఏమాత్రం లేదని చురకలంటించారు. ఇతర భాషలు నేర్చుకోవద్దు అనడం లేదని, ప్రాధాన్యత మాత్రం కచ్చితంగా ముందు మాతృభాషకే ఇవ్వాలని సూచించారు. మాతృభాష కళ్లు లాంటిదని, పరభాష కళ్లద్దాలు లాంటిదని విశ్లేషించారు. హిందుత్వం అంటే ఒక ఇరుకైన మతం కాదని, ఎవరినీ ద్వేషించని ఒక గొప్ప జీవన విధానం, అత్యంత విశాలమైన సంస్కృతి అని ఆయన వివరించారు. భారతదేశం ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యధిక వాటాను కలిగి ఉండి విశ్వగురువుగా వెలుగొందిందని, మన దేశం సుదీర్ఘ



చరిత్రలో ఎప్పుడూ ఇతర దేశాలపై దండెత్తలేదని గుర్తు చేశారు. భారతీయ సనాతన ధర్మం సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని కోరుకుంటుందని ఉద్ఘాటించారు. తాత్కాలిక రుచుల కోసం పాశ్చాత్య ఆహారపు అలవాట్లకు బానిసలైతే భవిష్యత్తులో నిరంతరం దీర్ఘకాలిక రోగాల బారిన పడక తప్పదని యువతను హెచ్చరించారు. తక్షణమే తయారయ్యే ఆహారం తింటే నిరంతర రోగాలు వస్తాయని, సహజసిద్ధమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. నిత్యం యోగా, సూర్య నమస్కారాలు చేయడం ద్వారా శారీరక ధారుడ్యాన్ని పెంచుకోవాలని కోరారు. ఆధునిక సాంకేతికత ఎంత పెరిగినా కృత్రిమ మేధస్సుకు మానవ మేధస్సు, భావోద్వేగాలు ఉండవని, దాని పరిమితులు తెలుసుకొని వాడుకోవాలని తెలిపారు. సమాచార సాంకేతికతను మానవళి అభివృద్ధి కోసం వాడుకోవాలి తప్ప వినాశనానికి కాదని స్పష్టం చేశారు. పిల్లలు దూరదర్శిని, చరవాణులు విపరీతంగా చూడటం వల్ల అనేక అనర్థాలు వస్తాయని, వాటి వాడకాన్ని కచ్చితంగా నియంత్రించాలని తల్లిదండ్రులకు సూచించారు. శారీరక శ్రమ లేకపోవడం వల్లే అనేక రుగ్మతలు దరిచేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన జీవితం ఒక సాధారణ రైతు కుటుంబం నుండి ప్రారంభమైందని, చిన్న వయసులో ఆటలు ఆడటానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శాఖకు వెళ్ళడం ద్వారా తనలో క్రమశిక్షణ, దేశభక్తి మొలకెత్తాయని ఆయన తన గతాన్ని నెమరువేసుకున్నారు. వాజ్‌పేయి, అద్వానీ లాంటి గొప్ప నాయకుల మార్గదర్శకత్వంలో పనిచేశానని తెలిపారు. సాధారణ రాజకీయ కార్యకర్త స్థాయి నుండి మంత్రిగా, జాతీయ అధ్యక్షుడిగా, అత్యున్నతమైన భారత ఉపరాష్ట్రపతి పదవిని అధిరోహించానంటే దానికి ప్రధాన కారణం కేవలం క్రమశిక్షణ, వ్యవస్థ అందించిన ప్రోత్సాహమే అని వినయంగా తెలియజేశారు. నిరంతరం నేర్చుకునే తపన ఉంటే ఎంతటి ఎత్తైనా ఎదగవచ్చని, యువత కూడా అదే బాటలో నడవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. పత్రికా విలేకరులు కూడా సమాజ హితం కోరే వార్తలు రాయాలని కోరారు. ఇటువంటి అద్భుతమైన కార్యక్రమాన్ని ఖమ్మం పట్టణంలో ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నారపు రాజు రామచంద్రరావు మాట్లాడుతూ నేటి రాజకీయ వాతావరణంపై ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయిని అన్ని రాజకీయ పక్షాల నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వాజ్‌పేయి మాటలు, ప్రసంగాల స్ఫూర్తితో ఎంతో మంది యువత రాజకీయాల్లోకి, సాహిత్యంలోకి వచ్చారని తెలిపారు. నాడు దూరదర్శన్‌లో వాజ్‌పేయి ప్రసంగాలను ప్రజలు ఎంతో ఆసక్తిగా చూసేవారని గుర్తుచేశారు.
ఒక ప్రతిపక్ష నాయకుడిగా, చట్టసభల సభ్యుడిగా, ప్రధానమంత్రిగా ఎలా ఉండాలో వాజ్‌పేయి దేశానికి చూపించారని రామచంద్రరావు కొనియాడారు. తాను శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైనప్పుడు సభలో అసభ్య పదజాలం వాడకూడదని, సభా వేదిక వద్దకు వెళ్లకూడదని వెంకయ్య నాయుడు, వి. రామారావు తనకు సూచించారని తెలిపారు. నేటి రాజకీయాల్లో ఆరోగ్యకరమైన విమర్శలకు బదులు బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. శాసనసభలలో వస్తువులు పగులగొట్టడం, బట్టలు చించుకోవడం లాంటివి చేస్తున్నారని, తెలంగాణలో ఈ బూతుల సంస్కృతి పోవాలని హితవు పలికారు. వాజ్‌పేయి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు కాశ్మీర్ సమస్యపై మాట్లాడేందుకు ఆయనను ఐక్యరాజ్యసమితికి పంపడం మన దేశ ప్రజాస్వామ్య గొప్పతనానికి నిదర్శనం అని ప్రశంసించారు. వాజ్‌పేయి ఒక గొప్ప కవి అని, ఆయన రాసిన గీతాలను ప్రముఖ గాయకుడు జగ్జీత్ సింగ్ పాడారని గుర్తుచేశారు. కవితా సంకలనాన్ని తీసుకువచ్చిన ఖమ్మం వాసి వెంకటేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. వాజ్పేయి శతజయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షులు దుద్దుకూరి వెంకటేశ్వరరావు, మందడపు ప్రభాకర్ రెడ్డి, లతోపాటు కార్యక్రమంలో సామాజిక సమరసత జాతీయ కళా విభాగం కన్వీనర్, రిటైర్డ్ ప్రొఫెసర్ అప్పల ప్రసాద్ జి, ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి , కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ , భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి భాస్కరరావు నెల్లూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్‌లో జర్నలిస్టులకు అండగా ఎమ్మెల్యే ప్రకటన

## ప్రతి నెలా లక్ష రూపాయలతో సంక్షేమ నిధి -- చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు తోడ్పాటు

**మహబూబ్ నగర్, మార్చ్ 01 (అక్షర కలం):**

ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా నిలవాలంటే జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టుల భద్రత, సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమాల్ మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

**"జర్నలిస్టులే ప్రజల స్వరం"**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వారే జర్నలిస్టులని, వారి సేవలు సమాజానికి అమూల్యమని కొనియాడారు. గ్రామీణ, పట్టణ స్థాయిల్లో ప్రజా




సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యతను వారు సమర్థంగా నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. మీడియా స్వేచ్ఛ మరియు జర్నలిస్టుల భద్రత ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. జర్నలిస్టుల ఇళ్లు, ఆరోగ్య బీమా, గుర్తింపు కార్డులు, పింఛన్ వంటి సంక్షేమ అంశాలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, ఇవి న్యాయమైన డిమాండ్లేనని తెలిపారు. ఈ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**జర్నలిస్టుల సంక్షేమ నిధి -- నెలకు లక్ష రూపాయలు**

సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా "జర్నలిస్టుల సంక్షేమ




నిధి" ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ నిధి విపత్కర పరిస్థితుల్లో, ముఖ్యంగా చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు సహాయం అందించేందుకు ఉపయోగపడాలని అన్నారు.
ఈ నెల నుంచే ప్రతి నెలా లక్ష రూపాయలను ఈ నిధికి అందిస్తానని ప్రకటించారు. ప్రజా ప్రభుత్వం ప్రతి వర్గానికీ సమన్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. గత పాలనలో జరిగిన ఆర్థిక అవ్యవస్థల కారణంగా రాష్ట్ర ఖజానా ఒత్తిడిలో ఉన్నప్పటికీ, ప్రజా సంక్షేమంపై రాజీ ప3డబోమని స్పష్టం చేశారు.

**ఐక్యంగా ముందుకు సాగాలి**




జర్నలిస్టులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం కృషి చేయాలని, ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మీడియా--ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు కొనసాగితే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

**సీనియర్ జర్నలిస్టులకు ఘన సన్మానం**

కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా మేయర్, డిప్యూటీ మేయర్, పలువురు సీనియర్ జర్నలిస్టులకు శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కారం నిర్వహించారు. నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండి విజయ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం అసెంబ్లీలో చర్చించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా జర్నలిస్టులకు గృహ వసతి సౌకర్యం కల్పించి, ఇప్పటికే కేటాయించిన ఇండ్లకు తాళంచెవులు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు, ప్రెస్ క్లబ్ సభ్యులు, కార్పొరేటర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మన్యంలో ‘మంచి’ వైద్యం.. గిరిజనులకు కొండంత అండ!

### రూ. 10.70 కోట్లతో చర్ల జనజ అప్‌గ్రేడేషన్.. 30 పడకల ఆసుపత్రికి మంత్రి పొంగులేటి భూమిపూజ

### గిరిజన బిడ్డల ఆరోగ్యంపై రాజీ పడం..

### సిబ్బంది సమస్యలు తీర్చి... సేవలు

### మెరుగుపరుస్తాం : మంత్రి భరోసా

**అక్షర కలం/ భద్రాచలం:**

చర్ల : గిరిజన పల్లెలకు ఊరటనిచ్చేలా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను (జనజ) రూ. 10.70 కోట్ల భారీ





వ్యయంతో 30 పడకల అత్యాధునిక ఆసుపత్రిగా తీర్చిదిద్దే పనులకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు.

**గిరిజన ప్రాంత అభివృద్ధియే లక్ష్యం..**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత గిరిజన బిడ్డలకు మెరుగైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. మారుమూల గ్రామాల ప్రజలు వైద్యం కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా చర్ల హెల్త్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. “మన రాష్ట్రంలో వైద్య సేవలకు మంచి పేరుంది. వైద్య ఉద్యోగులకు ఏవైనా సమస్యలు ఉంటే కలెక్టర్ ద్వారా నా దృష్టికి తీసుకురండి, వాటిని పరిష్కరించి గిరిజనులకు మరింత మెరుగైన సేవలు అందేలా చూస్తాం” అని ఆయన హామీ ఇచ్చారు.

**రోగుల పరామర్శ.. భరోసా..**

అనంతరం ఆసుపత్రిలోని గిరిజన రోగులను మంత్రి పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స, మందుల సరఫరా గురించి ఆరా తీశారు. “మీకు తోడుగా ప్రభుత్వం ఉంది, ఆందోళన చెందకండి” అంటూ గిరిజన బాధితులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఎ పీఓ బి. రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార లోపంతోనే శారదా పీఠం భూములపై గందరగోళం:

### పొరపాట్లు దొర్లితే సరిదిద్దుకునేందుకు మాకెలాంటి భేషజాలు లేవు:

### పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా ప్రభుత్వం: మంత్రి శ్రీధర్ బాబు:

**హైదరాబాద్ : మార్చి 1, ( అక్షర కలం న్యూస్ ):**

కోకాపేట్‌లోని శ్రీ శారదా పీఠం భూముల వ్యవహారంలో ‘సమాచార లోపం’ వల్లే గందరగోళం తలెత్తిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆ భూములు పీఠానికే చెందుతాయని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. పీఠం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఆదివారం కోకాపేట్ లోని శ్రీ శారదా పీఠాన్ని సందర్శించి... అక్కడి రాజ శ్యామల అమ్మవారి ఆలయం, ఇతర నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామీజీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తోందని అన్నారు. మా ప్రభుత్వానికి భేషజాలు లేవని, తప్పులు దొర్లితే ఎప్పటికప్పుడు సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అసలు విషయం తెలిసిన వెంటనే శారదా పీఠం భూముల విషయంలో జరిగిన పొరపాటును వెంటనే సరిదిద్దుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మతాన్ని అడ్డు పెట్టుకొని కొందరు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని



విమర్శించారు. తమ రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మాది బుల్డోజర్ సంస్కృతి కాదని, కబ్జాకోరుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడటం చూసి ఓర్వలేకే కొందరూ మాపై కావాలనే బురద చల్లుతున్నారని విమర్శించారు. బాపు ఘాట్ అభివృద్ధి విషయంలో ప్రజాభీష్టం మేరకే ముందుకెళ్తామని, తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని స్థానికులకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.

# అసెంబ్లీ నుంచి మున్సిపల్ దాకా.. అంతా ‘వన్ సైడ్’!

### ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మా పక్షమే..

### కుతంత్రాలకు దేవుడు శిక్ష వేస్తాడు

### ప్రతిపక్ష నేతలు ఒంటి నిండా విషం నింపుకుని చిమ్ముతున్నారు

### వర్షాకాలం పంట నాటికి ‘పాలెం వాగు’ పూర్తి చేస్తాం

### భద్రాచల నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు

### పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయతో కలిసి నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లకు సన్మానం

**అక్షర కలం/ భద్రాచలం:**

భద్రాచలం : “రెండేళ్ల క్రితం రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నుంచి మొదలై.. పార్లమెంట్, ఉప ఎన్నికలు, మొన్నటి పంచాయతీ ఎన్నికలు, తాజాగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల దాకా ప్రజలు కాంగ్రెస్ పార్టీని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఏ ఎన్నిక వచ్చినా తీర్పు ‘వన్ సైడ్’గానే ఉంది. ఇది జీర్ణించుకోలేని గత పాలకులు ఒంటి నిండా విషాన్ని నింపుకుని చిమ్ముతున్నారు. ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు, ఆ భగవంతుడు వారికి తగిన బుద్ధి చెప్పడం ఖాయం” అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భద్రాచలం నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల సన్మాన సభలో ఆయన ప్రసంగించారు.

### ప్రజా విజయాన్ని





### జీర్ణించుకోలేక విష ప్రచారం!

పదేళ్ల పాటు రాష్ట్రాన్ని ఏలిన వారు ధనిక తెలంగాణను అప్పుల పాలు చేశారని పొంగులేటి ధ్వజమెత్తారు. “అప్పుల రాష్ట్రంలోనూ మేము పేదవాడి ప్రేమను పొందుతూ, వారు చేయలేని పనులు చేసి చూపిస్తుంటే ప్రతిపక్షాలకు అరగడం లేదు. అందుకే ముఖ్యమంత్రిపై, మంత్రులపై అవాకులు చెవాకులు పేలుతున్నారు. నిజం చెప్పే ధైర్యం, జ్ఞానం వారికి ఆ దేవుడు ఇవ్వలేదు. మళ్ళీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పాత సీట్ల కంటే మరో 10 స్థానాలు అదనంగా గెలిచి, తెలంగాణ గడ్డపై మరోమారు మూడు రంగుల జెండా రెపరెపలాడటం ఖాయం” అని ధీమా వ్యక్తం చేశారు.

### లక్ష కోట్లు దోచారు.. పాలెం వాగును వదిలేశారు

గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు దోచుకున్నారని మంత్రి ఆరోపించారు. “దివంగత నేత రాజశేఖర్ రెడ్డి పాలెం వాగు ప్రాజెక్టుకు శ్రీకారం చుడితే, పదేళ్ల పాలనలో దానిని పూర్తి చేయాలనే జ్ఞానం వీరికి రాలేదు. 15 వేల ఎకరాలకు నీరు రావాల్సి ఉంటే, కేవలం 3-4 వేల ఎకరాలకే అందుతోంది. రెండు మూడు రోజుల్లోనే సీతక్క, నేను, ఇరిగేషన్ మంత్రి చర్చించి, రాబోయే వర్షాకాలం పంట నాటికి పాలెం వాగు మిగిలిన పనులన్నీ పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం. అలాగే రాళ్లవాగు వంతెనను కూడా ఇదే సీజన్లో పూర్తి చేస్తాం” అని హామీ ఇచ్చారు.

### ఖాతాల్లోకి నేరుగా ‘ఇందిరమ్మ’ నిధులు

ఒకటో తారీఖున ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు పడ్డట్టే, ఒక్క రూపాయి లంచం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే ఇందిరమ్మ ఇళ్ల నిధులు జమ చేస్తున్నాం. ములుగు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట ప్రాంతాల్లో తార్పాల్ గుడిసెల కింద నివసించే నిరుపేదలను చూసి, ఈ నియోజకవర్గాలకు మొదటి విడతలో అదనపు ఇళ్లను కేటాయించాం. ఏప్రిల్‌లో రెండో విడత ఇస్తాం.. ఇలా మొత్తం మూడు విడతల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టిస్తాం. ఇది కాగితాలకే పరిమితమయ్యే ప్రభుత్వం కాదు.

### అధికార తాళం చెవి మీ దగ్గరే ఉండాలి!

కొత్తగా ఎన్నికైన మహిళా సర్పంచులకు మంత్రి పొంగులేటి ఆత్మీయ పిలుపునిచ్చారు. “మీరు ఎన్నికయ్యారు.. పరిపాలన కూడా మీరే చేయండి. అధికార తాళం చెవులను మా తమ్ముళ్ల (భర్తల) చేతికి ఇచ్చి మీరు వెనుక ఉండకండి. మంత్రి సీతక్క ఏ విధంగా ధైర్యంగా పాలిస్తున్నారో, మీ గ్రామ పంచాయతీల్లో మీరు కూడా అదే విధంగా పాలించి ఆదర్శంగా నిలవాలి” అని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), స్థానిక పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**30 రోజుల పని దినాలు కల్పించాలి -- జిల్లా విద్యుత్ శాఖ అధికారికి వినతి**



**కోయిలకొండ, మార్చ్ 1 (అక్షర కలం ):**

జిల్లాలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించి, న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఆదివారం వారు జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా విద్యుత్ శాఖ అధికారి (ఎస్పీ) భీమా నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీటర్ రీడర్లు మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ, మండల, జిల్లా స్థాయిల్లో విధులు నిర్వహిస్తున్న తమకు ప్రతి నెల 30 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్కువ పని దినాలతో జీవనోపాధి కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల సమయంలో తాము కేవలం మీటర్ రీడింగ్ మాత్రమే కాకుండా, లైన్మెన్ పనులు కూడా చేయాల్సి వస్తోందని, విద్యుత్ స్తంభాలు ఎక్కి ప్రమాదకర పరిస్థితుల్లో పనులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని విద్యుత్ మీటర్ రీడర్లు సమ్మెబాట పట్టనున్నట్లు స్పష్టం చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సమ్మెలో కూడా పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను ఆమోదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాలకు చెందిన విద్యుత్ మీటర్ రీడర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఊరు మందమర్రి చెరువు కట్టపై మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు

**మందమర్రి/ చెన్నూరు మార్చి01 అక్షర కలం ప్రతినిధి:-**



ఊరు మందమర్రి చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటుకు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి సదానంద్ యాదవ్ రాష్ట్ర మంత్రి, ఎంపీ వంశీకృష్ణకు విన్నవించడంతో మంత్రి వివేక్ వెంకటస్వామి కోటి రూపాయలను మంజూరు చేస్తూ మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. మందమర్రి పట్టణంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా యాదవ సంఘం నాయకుడు బండి సదానందం యాదవ్ వాకర్స్ తో కలిసి మంత్రి వివేక్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో బండి సదానంద యాదవ్ మాట్లాడుతూ.. వాకర్స్ అసోసియేషన్ వారు ఊరు మందమర్రి చెరువు కట్టపై వాకర్స్ ట్రాక్, మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు చేయాలని గతంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామికి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు వినతి పత్రం అందజేయడం జరిగిందని చేయడం సంతోషంగా ఉందని అన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

### రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు:

**హైదరాబాద్: మార్చి: ( అక్షర కలం న్యూస్ ):**

ఆపదలో ఉన్న వారికి చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నేటితరం యువత సామాజిక స్పృహతో రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆదివారం జూబ్లీహిల్స్ లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ లో ఎస్ఎస్ఎస్ యువ సేన ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు 89వ జయంతి(మార్చి 2న)ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు



మాట్లాడుతూ.... రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర ఆపరేషన్ల సమయంలో రక్తం సకాలంలో అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా తలసేమియా వంటి వ్యాధులతో బాధపడే చిన్న పిల్లలకు ప్రతి నెలా రక్తం ఎక్కించడం వారి జీవనాధారంగా మారిందన్నారు. ఇలాంటి తరుణంలో మనమిచ్చే ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను నిలబెడుతుందన్నారు. రక్తం ఇచ్చేటప్పుడు ఎవరూ కులం, మతం, ప్రాంతం చూడరని.. ఇది మనుషులందరినీ కలిపే గొప్ప మానవత్వమన్నారు. అపోహలు వీడి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.



# నెలరోజుల పాటు ఆంక్షలు

### మహబూబ్ నగర్ జిల్లాలో పోలీసు చట్టం అమలు



**మహబూబ్ నగర్, మార్చి 1. అక్షర కలం :**

జిల్లాలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు మార్చి 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి మార్చి 31వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పోలీసు చట్టంలోని 30, 30(ఎ) సెక్షన్లు అమల్లో ఉంటాయని జిల్లా పోలీసు అధికారి డి. జానకి వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రజా శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కాలంలో పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రజాధనానికి నష్టం కలిగించే విధంగా లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడకూడదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించి శాంతి వాతావరణాన్ని కొనసాగించాలన్నారు. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసు అధికారి స్పష్టం చేశారు.

# ఎస్సీ వర్గీకరణ సాధనకు అమరుల త్యాగాలు ప్రేరణ

### మహబూబ్‌నగర్‌లో మాదిగ వీరుల దినోత్సవం ఘనంగా నిర్వహణ



**మహబూబ్‌నగర్, మార్చ్ 01. అక్షర కలం :**

ఎస్సీ వర్గీకరణ కోసం దీర్ఘకాలంగా సాగుతున్న ఉద్యమంలో త్యాగం చేసిన మాదిగ అమరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 1న మహబూబ్‌నగర్‌లో భావోద్వేగ వాతావరణంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక జగ్జీవన్ రామ్ సర్కిల్లో, తెలంగాణ చౌరస్తా వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహం సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా బాధ్యుడు మైలవరం శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ స్మారక కార్యక్రమంలో అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, రెండు నిమిషాల మౌనం పాటించి ఘన నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మాదిగ సమాజం ఎన్నో ఏళ్లుగా నిరంతర పోరాటం సాగిస్తున్నదని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలు సమాజానికి దారిదీపమని, వారి ఆశయాలను సాధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం కోసం సాగుతున్న ఈ పోరాటం కేవలం ఒక వర్గానికి సంబంధించినది కాదని, సమాన హక్కుల సాధనకు సంబంధించినదని వక్తలు అభిప్రాయపడ్డారు. ఎస్సీ వర్గీకరణ అమలు ద్వారా అట్టడుగు వర్గాలకు నిజమైన న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వాలు ఈ సమస్యను మరింత ఆలస్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి నాయకుడు ఎనుముల వెంకటస్వామి, సీనియర్ నాయకుడు బోయపల్లి నర్సింలు, రాష్ట్ర అధ్యక్షుడు శిరసనోళ్ల బాలరాజు, ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పగిడ్యాల్ బోరు కృష్ణయ్యతో పాటు బొక్కి రాములు, జాజిమొగ్గ నర్సింలు, కొడుపర్తి రాములు, జయన్న, కొమ్ము కొండన్న, పోలకంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అమరుల త్యాగస్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లుతూ ఎస్సీ వర్గీకరణ సాధన వరకు ఉద్యమం నిరంతరంగా కొనసాగిస్తామని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా "అమరుల త్యాగాలు చిరస్థాయి" అంటూ నినాదాలు చేశారు.

# గండీడ్‌లో రాజకీయ రంగు గట్టిగా...

### కొమ్మిరెడ్డిపల్లి నుంచి ఎంపీటీసీ ప్రపోజల్లో టైగర్ రవీంద్ర

గండీడ్, మార్చి 1 (అక్షర కలం): గండీడ్ మండల రాజకీయాలు మళ్లీ చురుగ్గా మారుతున్నాయి. మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు టైగర్ రవీంద్ర ఎంపీటీసీ ప్రపోజల్లో ఉన్నారన్న వార్తలతో స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చలు జోరందుకున్నాయి. అధికారిక ప్రకటన ఇంకా వెలువడకపోయినా, గ్రామస్థులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయన్న సమాచారం అందుతోంది.



గ్రామాభివృద్ధే లక్ష్యమంటూ ప్రజల్లోకి వెళ్తున్న రవీంద్రకు యువత, రైతు వర్గాల్లో ఆదరణ పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. తాగునీటి సమస్య, కాలువల నిర్మాణం, అంతర్గ్రామ రహదారుల మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలపై గతంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉందని గ్రామ పెద్దలు అభిప్రాయపడుతున్నారు. "గ్రామ సమస్యలను దగ్గరగా తెలుసుకుని పరిష్కారం దిశగా కృషి చేయడం నా బాధ్యత" అని రవీంద్ర తన సన్నిహిత వర్గాలతో చెప్పినట్లు తెలుస్తోంది. ఎంపీటీసీగా అవకాశం దక్కితే మండల పరిధిలో గ్రామానికి మరింత అభివృద్ధి నిధులు సాధించడంతో పాటు పాఠశాలల బలోపేతం, ఆరోగ్య సేవల విస్తరణ, రైతులకు పథకాల సక్రమ అమలు, మహిళా సంఘాల ప్రోత్సాహం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తానని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే గ్రామంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. పలు వర్గాలు తమ తమ అంచనాలు వేసుకుంటుండగా, టైగర్ రవీంద్ర ప్రపోజల్‌పై ఆసక్తి పెరుగుతోంది. గండీడ్ మండలంలో ఈసారి ఎంపీటీసీ ఎన్నికలు ఉత్కంఠభరితంగా మారే అవకాశాలున్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కొమ్మిరెడ్డిపల్లిలో మొదలైన ఈ రాజకీయ కదలికలు మండలవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. చివరకు ప్రజాభిప్రాయం ఏ దిశగా మొగ్గుతుందో వేచి చూడాల్సి ఉంది.

# ఘనంగా మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

### ఉప్పల్ నియోజకవర్గం నాచారం కేంద్రంలో గౌరవప్రదంగా నిర్వహణ....!!

### – ఏబీసీడీ వర్గీకరణ సాధనలో అమరవీరుల త్యాగాలు స్మరణ

**అక్షర కలం :**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం కేంద్రంలో మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, దీపప్రజ్వలన చేసి, రెండు నిమిషాల మౌనం పాటిస్తూ ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం అంతటా భావోద్వేగభరిత, గౌరవప్రద వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల



త్యాగ ఫలితంగానే ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఆవిర్భావం నాటి నుంచి సాగిన ఉద్యమం ఎన్నో అడ్డంకులను అధిగమించి విజయాలను సాధించిందని గుర్తుచేశారు. ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన వారి ఆశయాలను సాకారం చేయడమే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కేశపాగ రాంచందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ కోరపాక అంజి మాదిగ, జై భీం వ్యవస్థాపకులు నల్ల బాబు, ఎంజెఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్, సీనియర్ జర్నలిస్టు ఎల్ల సంతోష్, గజ్జెల రాంచందర్, శివ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, స్థానికులు హాజరై అమరవీరులకు నివాళులు అర్పించారు.

# వెలుగుమట్ల బాధితుల సేవలో బీఆర్ఎస్

### – వరుసగా నాలుగో రోజు భోజనాలు

### – ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఔదార్యం







**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం నగర శివారు వెలుగుమట్లలోని భూదాన్ భూమిలో ఇల్లు కోల్పోయిన బాధితులకు బీఆర్ఎస్ పార్టీ బాసటగా నిలుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన మేరకు వరసగా 4వ రోజు కూడా బీఆర్ఎస్ పార్టీ భోజనాలను సమకూర్చింది. ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం వెలుగుమట్ల బాధితులకు అన్నదానం చేశారు. పునరావస కేంద్రాల్లో తలదాచుకుంటున్న తమకు కనీస సదుపాయాలు కూడా కల్పించడం లేదని బాధితులు వాపోతున్నారు. ఈ తరుణంలో బీఆర్ఎస్ పార్టీ ముందుకు వచ్చి సమయానికి భోజనాలు, మంచినీళ్లు అందిస్తూ అండగా ఉంటున్నారని అభినందిస్తున్నారు. వెలుగుమట్ల బాధితులకు కనీస సదుపాయాలే కాకుండా.. న్యాయపరమైన సహకారాన్ని కూడా అందజేస్తామని టిఆర్ఎస్ నేతలు హామీ ఇచ్చారు. బాధితులు అధైర్యపడకుండా ఉండాలని భరోసా కల్పించారు. తమకు నాలుగు రోజుల నుంచి దగ్గరుండి భోజనాలు, మంచినీళ్లు అందజేస్తూ అండగా ఉంటున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు బాధితులు జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర పిఎ సయ్యద్ ఇస్మాయిల్, బీఆర్ఎస్ నేతలు పగడాల నరేందర్, ఆసిఫ్, బురాన్, రవన్న యూత్ సభ్యులు నానబాల హరీష్, వరాల గణేష్, సాయి, రాజేష్, జగదీష్, తాళ్లూరి సాయి తదితరులు పాల్గొన్నారు.



# భూధాన భూములలోనే పేదలకు పక్కా ఇళ్ళు కట్టించాలి!

### –పేదల ఇళ్ల కూల్చివేత కి ముగ్గురు మంత్రులే బాధ్యత వహించాలి

### --భూధాన యజ్ఞం భూములను రెవెన్యూ శాఖ ఏలా స్వాధీనం చేసుకుంటుంది

### --పేదలకు న్యాయం చేయకపోతే ...

### సిపిఎం ఆందోళనలు ఉధృతం

### పోతినేని సుదర్శన్ రావు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు– డిమాండ్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



ఖమ్మం పట్టణంలో ప్రభుత్వం కూల్చి వేసిన ఇండ్లు ఉన్న భూధాన భూములు విషయంలో మంత్రి తుమ్మల వ్యాఖ్యలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు తీవ్రంగా ఖండించారు. పేదల ఇళ్ల కూల్చివేత కి జిల్లా కి చెందిన ముగ్గురు మంత్రులే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోతినేని మాట్లాడుతూ మంత్రి తుమ్మల చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని విమర్శించారు. భూధాన భూములు విలువైనవని పేర్కొనడం సరైనది కాదని అన్నారు. భూధాన భూములు దానం చేసిన వారు పేదల కోసమే దానం ఇచ్చారని గుర్తు చేశారు. 1965, భూదాన యజ్ఞ బోర్డు చట్టం కూడా ఈ భూములు పేదలకే ఇవ్వాలని చెపుతున్నదని ఆయన అన్నారు. అవి విలువ ఎక్కువున్నా, తక్కువున్నా పేదలకే చెందుతాయని ఆయన తెలిపారు. చట్టాన్ని పక్కన పెట్టి "విలువైన భూములు" అనే పేరుతో పేదలను అక్కడి నుంచి వెళ్లగొట్టడం చట్ట ఉల్లంఘనతో సమానమని స్పష్టం చేశారు. 147, 148, 149 సర్వే నంబర్లలో ఉన్న భూముల్లో పేదలకు అక్కడికక్కడే పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూధాన భూముల్లో ఇళ్లు కోల్పోయిన పేదలను చీలదీసి, బెదిరించి నష్టం కలిగించేలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వారికి షెల్టర్ గా ప్రస్తుతం కేటాయించిన అంబేద్కర్ భవన్, టిటిడిసి భవనాలకు వాడుకొనే నీళ్ళు కూడా బంద్ చేశారు. అక్కడ వృద్ధులు, చంటి పిల్లల తల్లులు, గర్భిణీ స్త్రీలు నరకం అనుభవిస్తున్నారని అన్నారు. గుట్టలలో ఇళ్లు వేసుకుని నివసిస్తున్న వారు అంతా పేదలేనని, వారికి న్యాయం చేయాలని కోరారు. వారిని స్వంత గ్రామాలకు పంపాలని మండల రెవిన్యూ అధికారులతో వత్తిడి చేసి భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. పునరావాస కేంద్రాల్లో తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఈ విషయంపై నైతిక బాధ్యత వహించాలని అన్నారు. భూధాన యజ్ఞం భూములను రెవెన్యూ శాఖ ఎలా స్వాధీనం చేసుకుంటుందని ప్రశ్నించారు. 147, 148, 149 సర్వే నెంబర్ల లోని ఈ భూధాన భూముల్లో ఈ పేదలకు నాటి చైర్మన్ రాజేందర్ రెడ్డి స్వయంగా పట్టాలు ఇచ్చానని చెప్పారని గుర్తుచేశారు. ఇళ్లు నిర్మించి ఇవ్వకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై విక్రమ్, బండి రమేష్, భూక్యా వీరభద్రం, మెరుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955